
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

మంగళవారం 13 ఫిబ్రవరి 2024



18న అప్పుఘర్ వద్ద లోకేశ్ బహిరంగ సభ

-వార్త 6లో

కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా
- ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఏఈఆర్‌వోలకు విశాఖలో శిక్షణ

- వార్త మెయిన్‌లో

రాజకీయ క్రీడకు జన సమీకరణ

నేడు 'ఆడుదాం... ఆంధ్రా' ముగింపు కార్యక్రమం

వేదికగా పీఎం పాలెం క్రికెట్ స్టేడియం

- హాజరుకానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి
- 25 వేల మందిని తీసుకురావాలని నేతలకు 'పెద్దల' ఆదేశం
- విశాఖలో వార్డుకు 350 మంది...
- ఒక్క జోన్-3కే 90 బస్సులు... 5,000 మంది టార్గెట్
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 585 ఆర్టీసీ బస్సులు



ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, ఇతర అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'ఆడుదాం...ఆంధ్రా' పేరుతో నిర్వహిస్తున్న పోటీలకు వందల కోట్ల రూపాయలు మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారు. ఈ పోటీల ముగింపు వేడుక మంగళవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహిస్తున్నారు. దీనికి భారీగా జన సమీకరణ జరుగుతోంది. పోతినమల్లయ్యపాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని (ఏసీఏ-వీడీసీఏ) వేదికగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఇక్కడ కేవలం 500 మందికి బహుమతి ప్రదానం జరగనుండగా ఈ కార్యక్రమం వీక్షించడానికి 25 వేల మందిని తీసుకు రావాలని వైసీపీ పెద్దలు టార్గెట్ ఇచ్చారు.

ఉత్తరాంధ్రా జిల్లాల నుంచి జనాల తరలింపునకు ఆర్టీసీ నుంచి 585 బస్సులు తీసుకున్నారు. ఇవి కాకుండా ప్రైవేటు విద్యా సంస్థల నుంచి కూడా బలవంతంగా బస్సులు తీసుకున్నారు. విశాఖపట్నంలో ఒక్కో వార్డు నుంచి 350 మందికి తక్కువ కాకుండా తేవాలని లక్ష్యం ఇచ్చారు. ఇందులో భాగంగా ఒక్క జోన్-3 కార్యాలయం పరిధిలో 14 వార్డుల నుంచి ఐదు వేల మంది తరలింపునకు 90 బస్సులు కేటాయించారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, కార్పొరేటర్లకు జన సమీకరణ బాధ్యత అప్పగించారు.

భారీగా వ్యయం...రూ.200 కోట్ల బడ్జెట్

ఆడుదాం...ఆంధ్రా పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్లు కేటాయించగా, స్పాన్సర్ల ద్వారా మరో రూ.80 కోట్లు వరకూ సేకరించారని ప్రచారం జరుగుతోంది. మొత్తం రూ.200 కోట్లతో ఎన్నికల ముందు రాజకీయ లబ్ధి పొందేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతి విభాగంలో ఎవరిని విజేతలుగా ప్రకటించాలో ముందుగానే నిర్ణయించుకొని ఆ మేరకు పోటీలు నిర్వహించారు. వైసీపీలో కీలక నాయకులు ప్రాధాన్యం వహిస్తున్న ప్రాంతాలకే అవార్డులు దక్కేలా చేసుకున్నారు. ఇందుకోసం బయట నుంచి కూడా క్రీడాకారులను తీసుకువచ్చి ఆడించారు. అదేమని ప్రశ్నించిన వారిని ఆట మధ్యలో తొలగించారు. జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలను మ్యాట్‌లపై నిర్వహించి, ఫైనల్స్‌కు వచ్చేసరికి మట్టిలో ఆడించారు. దాంతో చాలామంది కబడ్డీ ఆటగాళ్లు గాయపడ్డారు. మహిళా క్రికెట్‌లో కూడా మోసం చేశారు. చిత్తూరు జట్టును గెలిపించడానికి నెల్లూరు టీమ్‌ను నిర్వీర్యం చేశారు.

లేజర్ షో...డ్రోన్లతో షూటింగ్

సీఎం జగన్ మంగళవారం సాయంత్రం విశాఖపట్నం విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో రుషికొండ ఐటీ హబ్‌కు వస్తారు. అక్కడి నుంచి స్టేడియానికి కాన్వాయ్‌లో 5.30 గంటలకు చేరుకుంటారు. స్టేడియంలో ఓపెన్ టాప్ జీపులో వీక్షకులు అందరికీ అభివాదం చేస్తారు. ఆయన సమక్షంలో క్రికెట్ ... మిగతా 6వ పేజీలో

సీఎం పర్యటన కార్యక్రమం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో మంగళవారం సాయంత్రం 5.20 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 5.45 గంటలకు ఐటీ హిల్-3పై ఉన్న హెలీపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో ఆరు గంటలకు పీఎంపాలెం క్రికెట్ స్టేడియానికి వస్తారు. స్టేడియంలో ప్రజలకు అభివాదం చేసిన అనంతరం క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకిస్తారు. మ్యాచ్ ముగిసిన తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రోన్ షో, లైట్ షో వీక్షిస్తారు. అనంతరం అందరినీ ఉద్దేశించి మాట్లాడి, విజేతలకు బహుమతులు అందజేస్తారు. ఆ తరువాత రోడ్డుమార్గంలో రాత్రి 8.05 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, ప్రత్యేక విమానంలో బయలుదేరి విజయవాడ వెళతారు.

స్టీల్‌ప్లాంటు కేవీ క్లోజ్?

కేంద్రీయ విద్యాలయం క్రమంగా మూసివేతకు ఏర్పాట్లు



స్టీల్‌ప్లాంటులోని కేంద్రీయ విద్యాలయం

- ఈ ఏడాది ఒకటి, ప్లస్ 1 తరగతుల్లో అడ్మిషన్లు నిలిపివేత
- కొత్త అడ్మిషన్లు వద్దని సీఎండీ, మంత్రిత్వ శాఖ నుంచి ఆదేశాలు
- సిబ్బంది నియామకంలోను తాత్సారం
- 39లో సగం ఖాళీ
- విద్యార్థుల చదువులపై ప్రభావం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు విక్రయ ప్రక్రియ ప్రారంభం కాలేదంటూనే కేంద్ర ప్రభుత్వం మరో వైపు అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేసుకుంటూ పోతోంది. మొన్నటికి మొన్న నిర్వహణ భారం, నిధుల లేమి పేరుతో బ్లాస్ట్ ఫర్నేస్-3ని జిందాల్ కంపెనీకి కట్టబెట్టింది. ఇటీవలె స్టీల్‌ప్లాంటు జనరల్ ఆస్పత్రిని కూడా ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా కాంట్రాక్టు సిబ్బందిని ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నిలిపివేసింది. ఇప్పుడు కేంద్రీయ విద్యాలయంపై దృష్టి పెట్టింది. ఈ ఏడాది 1, 11 తరగతుల్లో ప్రవేశాలు ఇవ్వొద్దని సీఎండీ ప్రిన్సిపాల్‌కు లేఖ రాశారు. అలాగే ఉక్కు మంత్రిత్వ శాఖ కూడా ఆదేశాలు జారీచేసింది.

స్టీల్ ప్లాంటు ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పిల్లల కోసం ఇక్కడ 70 ఎకరాల్లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు క్లాసులు ఉన్నాయి. ఇవి కాకుండా సంగీతం, యోగా, స్పోర్ట్స్, తదితరాలు నేర్పిస్తారు. కొన్నేళ్ల క్రితం కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశ నిబంధనలు మార్చడంతో రిజర్వేషన్ల ఆధారంగా అందరికీ అవకాశం కల్పిస్తున్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ శాఖ, పారా మిలటరీలో పనిచేసే వారి పిల్లల కోసం దీనిని ఏర్పాటు చేశారు. ఒకటి నుంచి 12వ తరగతి వరకు 1,080 మందిని చేర్చుకోవడానికి అవకాశం ఉండగా ప్రస్తుతం 1,057 మంది ఉన్నారు. మొత్తం 27 సెక్షన్లు నిర్వహిస్తున్నారు.

సగం పోస్టులు ఖాళీ

స్టీల్‌ప్లాంటును ప్రైవేటుకు అప్పగించాలని చాలాకాలం క్రితమే నిర్ణయించడం వల్ల అందుకు అనుగుణంగా కేంద్రీయ విద్యాలయాన్ని కూడా మూసేయడానికి చాప కింద నీరులా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మొత్తం 39 మంది టీచింగ్ పోస్టులు ఉండగా...అందులో 19 ఖాళీగా ఉన్నాయి. అంటే సగం మందితోనే ... మిగతా 6వ పేజీలో

యువతకు ఉపాధి కల్పనకు ప్రధాని కృషి

- రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12: యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. నగరంలోని సాలిగ్రామపురంలో గల సాగరమాల ఆడిటోరియంలో సోమవారం రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సోమవారం ఒక్కరోజే లక్ష మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. దీనిలో భాగంగా విశాఖలో 193 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం సీఐఎస్ఎఫ్ (56), ట్రైబల్ వెల్ఫేర్ (8), ఎడ్యుకేషన్ (9), హెల్త్ (7), బీఎస్ఎఫ్ (17), ఈపీఎఫ్ (6), ఐటీ (12), పోస్టల్ (18), కస్టమ్స్ (2), రైల్వే (55), బ్యాంక్ (1), హెచ్‌పీసీఎల్ (1), డిఫెన్స్ (1) విభాగాల్లో ఉద్యోగాలు ఇస్తూ అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేశారు.

వైసీపీ నేత మట్టి మేత

ఎస్.ఆర్.పురంలో అనధికార తవ్వకం

- గతంలో జేసీబీ, వాహనాలను పట్టుకుని అధికారులకు అప్పగించిన మండలాధ్యక్షురాలు
- అయినా స్పందించని అధికారులు



ఎస్‌ఆర్ పురం కొండను గుల్ల చేసిన దృశ్యం

పెందుర్తి, ఫిబ్రవరి 12: మండలంలోని ఎస్.ఆర్.పురంలో అధికార పార్టీకి చెందిన నేత ఒకరు అడ్డగోలుగా కొండను తవ్వి రాయి, మట్టి అమ్ముకుంటున్నారు. అనధికారికంగా సాగుతున్న గ్రావెల్ తవ్వకాలను అడ్డుకోవాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్వయంగా అధికార పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. ఎస్.ఆర్.పురం సర్వే నంబర్‌లో 100లో గల కొండ వద్ద స్థానిక వైసీపీ నేత జిన్నాల జయరాజ్ ఆధ్వర్యంలో తవ్వకాలు సాగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన నేత కావడంతో ఏ అధికారీ ఆపే సాహసం చేయడం లేదు. కొంతకాలం కిందట ఎంపీపీ ముధుపాడ నాగమణి స్వయంగా ఆ క్వారీలో రాయిని తవ్వుతున్న జేసీబీని, లారీని పట్టుకుని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు వాహనాలు సీజ్ చేశారు. క్వారీ విషయమై నేతల మధ్య ఘర్షణ ఏర్పడడంతో స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ వద్ద పంచాయితీ జరిగినట్టు ప్రచారం జరిగింది. ఆ తరువాత కొంతకాలం తవ్వకాలు ఆగిపోయాయి. ఇటీవల మళ్లీ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఎంపీపీ భర్త అంజి, తదితరులు సోమవారం క్వారీ వద్దకు వెళ్లి పరిశీలించారు. అధిక సంఖ్యలో లారీలు, డంపర్లతో గ్రావెల్, రాయిని తరలించుకుపోతున్నారని గుర్తించారు. జయరాజ్ మైనింగ్ మాఫియా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గ్రావెల్ లారీలు పట్టుకుని అధికారులకు అప్పగించినా చర్యలు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి క్వారీలో తవ్వకాలను అడ్డుకోవాలన్నారు. మరో నేత మాట్లాడుతూ అక్రమ తవ్వకాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు.

బొండపల్లి నుంచి తహసీల్దార్‌ను అనుసరించా

- ఆయనతో మాట్లాడేందుకే అక్కడకు వెళ్లా
- ఇంటికి వచ్చిన తరువాత కూడా నాతో మాట్లాడేందుకు అంగీకరించలేదు



తహసీల్దార్ రమణయ్య



నిందితుడు గంగారావు

- అందుకే ఆయన కిందకు వచ్చేంత వరకూ వేచిచూశా
- బెదిరింపు ధోరణిలో మాట్లాడడంతో ఇనుప రాడ్డుతో దాడి చేశా
- ఇక్కడ నుంచి రమణయ్యకు బదిలీ అయిన తరువాత కన్వెయన్స్ డీడ్ జారీ కాదని నిర్ధారణకు వచ్చా
- ఆ తరువాత కలిస్తే కసురుకునేవారు, బెదిరించేవారు
- పోలీస్ విచారణలో నిందితుడు మురారి సుబ్రహ్మణ్యం గంగారావు
- ముగిసిన కస్టడీ
- పలు కీలక విషయాలు వెల్లడించినట్టు ప్రచారం

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ సనపల రమణయ్యను హత్య చేసిన మురారి సుబ్రహ్మణ్యం గంగారావు నాలుగు రోజుల పోలీస్ కస్టడీ సోమవారం ముగిసింది. కొమ్మాదిలోని ఎస్‌టీబీఎల్ వెనుక అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న తహసీల్దార్‌ను ఈనెల రెండో తేదీ రాత్రి పది గంటల సమయంలో గంగారావు ఇనుపరాడ్‌తో మోది హత్య చేసిన విషయం తెలిసిందే. హత్య చేసిన తర్వాత చెన్నై పారిపోయిన గంగారావును పీఎం పాలెం పోలీసులు ఈనెల నాలుగున అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా...రెండు వారాలు రిమాండ్‌కు ఆదేశించింది. తహసీల్దార్‌ను హత్య చేసింది గంగారావు అయినప్పటికీ వెనుక ఎవరున్నారు?, హత్య చేయాల్సినంత కక్ష రమణయ్యపై ఏముందనే అంశాలపై పోలీసులు దృష్టిసారించడం లేదనే విమర్శలు రావడం, నిందితుడిని కస్టడీకి తీసుకుని విచారించకపోవడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో గంగారావును పది రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కోర్టులో పిటిషన్ వేయగా, ఐదు రోజులకు అనుమతి లభించింది. కోర్టు అనుమతి మేరకు ఈనెల తొమ్మిదిన గంగారావును కస్టడీకి తీసుకున్న పోలీసులు పీఎం పాలెం స్టేషన్‌లో సోమవారం వరకూ విచారించారు. హత్య జరగడానికి మూడు నెలలు ముందు నుంచి గంగారావుకు సంబంధించిన సెల్‌ఫోన్ కాల్‌డేటా (సీడీఆర్)తోపాటు ... మిగతా 6వ పేజీలో

ఆడుదాం ఆంధ్రాలో అదే రచ్చ



కోర్టులో కూర్చుని నిరసన తెలియజేస్తున్న అనకాపల్లి జిల్లా క్రీడాకారులు

- అనకాపల్లి కబడ్డీ జట్టును డిస్ క్వాలిఫై చేస్తున్నట్టు ప్రకటించిన అధికారులు
- విశాఖ-కర్నూలు జట్ల మధ్య నిర్వహించతలపెట్టిన మ్యాచ్‌ను అడ్డుకుంటూ మైదానంలో అనకాపల్లి ఆటగాళ్ల నిరసన
- మ్యాచ్ ఆడించేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'ఆడుదాం...ఆంధ్ర' క్రీడా పోటీల్లో సోమవారం కూడా గొడవ జరిగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం మైదానంలో ఆదివారం అనకాపల్లి, విశాఖ జిల్లాల జట్ల మధ్య జరగాల్సిన కబడ్డీ మ్యాచ్ హైడ్రామా మధ్య వాయిదా పడిన విషయం తెలిసిందే. విశాఖ జిల్లా జట్టులో కొత్తగా చేరిన ఆటగాడిని అధికారులు గుర్తించి పక్కనపెట్టాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. సోమవారం ఉదయం ఇరు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహిస్తామని చెప్పారు. కానీ, అనూహ్యంగా సోమవారం మధ్యాహ్నం వరకు మ్యాచ్ నిర్వహించకపోగా, అనకాపల్లి జట్టును డిస్ క్వాలిఫై చేస్తున్నట్టు ప్రకటించారు. విశాఖ జట్టుకు కర్నూలు జిల్లా జట్టుతో మ్యాచ్ ... మిగతా 6వ పేజీలో

ప్రజలకు అందుబాటులో ఉంటా

స్టేషన్ స్థాయిలోనే న్యాయం జరిగేలా చూస్తా



- మావోయిస్టుల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి
- గంజాయి సాగు, రవాణాను నియంత్రిస్తాం
- రేంజ్ డీఐజీ విశాల్ గున్ని

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం వచ్చే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్ని అన్నారు. డీఐజీగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన తరువాత విలేకరులతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ స్థాయిలోనే ప్రజలకు న్యాయం జరిగేలా చేయడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. ఆ విధంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. రేంజ్ పరిధిలో ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి అన్ని విభాగాలను పటిష్ఠపరిచేందుకు కృషి చేస్తానన్నారు. పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల్లో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని, ఏజెన్సీలో గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం లేకుండా చర్యలు తీసుకుంటామని, నిబంధనలకు లోబడి పనిచేస్తూ ముందుకువెళతామని చెప్పారు. సామాజిక మాధ్యమాల ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో కథనాలు ప్రచురించే ముందు వివరణ తీసుకోవాలని మీడియాను కోరారు. సోషల్ మీడియాలో కొందరు అత్యుత్సాహం ప్రదర్శించి కథనాలు పోస్టు చేయడం వల్ల ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు. అందువల్ల ఒకటికి, రెండుసార్లు నిర్ధారణ చేసుకోవాలని విశాల్‌గున్ని అన్నారు. కాగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అన్ని జిల్లాల ఎస్పీలు, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిశారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- ఉమ్మడి జిల్లాలో 329 ఖాళీలు
- పాఠశాల విద్యాపరిధిలో 99, గిరిజన సంక్షేమ శాఖలో 135 ఖాళీలు
- రెసిడెన్షియల్ పాఠశాలల్లో 95
- ఉమ్మడి జిల్లాలో 35 వేల మంది అభ్యర్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల నుంచి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులను వైసీపీ ప్రభుత్వం నిరాశపరచింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కేవలం 329 ఖాళీలు (అన్ని మేనేజ్‌మెంట్లు కలిపి) ఉన్నట్టు చూపించింది. ఈ మేరకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం పాఠశాల విద్యా శాఖ పరిధిలో జడ్పీ, ప్రభుత్వ, మునిసిపల్ పాఠశాలల్లో 99, గిరిజన ప్రాంతంలో 135, రెసిడెన్సియల్ పాఠశాలల్లో 95 ఖాళీలు ఉన్నట్టు చూపించారు. పాఠశాల విద్యా శాఖ పరిధిలో ఎస్జీటీ పోస్టులు కేవలం 14 మాత్రమే ఉన్నాయి. స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో తెలుగు-7, హిందీ-27, ఇంగ్లీష్-9, గణితం-5, ఫిజికల్ సైన్స్-4, బయాలజీ-6, సోషల్ స్టడీస్-1, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 26...మొత్తం 85 ఖాళీలు ఉన్నాయి. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఎస్జీటీ 87, స్కూలు అసిస్టెంట్లు 47, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఒక స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఉన్నాయి. ఇక ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ) కేటగిరీలో ఏపీ మోడల్ స్కూళ్లలో తొమ్మిది, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో 10, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 23, గిరిజన సంక్షేమ గురుకులాల్లో 44, ఏపీ రెసిడెన్సియల్ పాఠశాలల్లో తొమ్మిది పోస్టులు ఖాళీ ఉన్నాయి. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో టీచర్ ట్రైనింగ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు మొత్తం 35 వేల మంది వరకూ ఉంటారు. గడచిన ఐదేళ్ల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో ఏటేటా అభ్యర్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.

వైభవంగా భక్త మార్కండేయ జయంతి



మృత్యుంజయ హోమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 12: వన్‌టౌన్ బురుజు పేటభావనరుషి ఈశ్వరాలయంలో శ్రీపద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం భక్త మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. అర్చకులు పార్వతీపరమేశ్వరులు, భావన రుషి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వేదపండితుల నేతృత్వంలో మహామృత్యుంజయహోమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలందించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మివేత్త ఎం.వి. రాజశేఖర్, పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు కొప్పల రాజ్‌కుమార్, పప్పు రాజారావు, నరసింగరావు, సతీష్, హేమలత పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీలకు మొండిచేయి'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 12: పక్కదారి పట్టించిన ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్ల నిధులను ఆ కార్పొరేషన్లకు తిరిగి కేటాయించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు.సోమవారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వేరే వాటికి ఖర్చుపెట్టి ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోందని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జగదాంబ-1 సీపీఎం కార్యదర్శి ఎం.సుబ్బారావు తదితరులుపాల్గొన్నారు.

సాయి సరిగమప సేవా సంస్థ వ్యవస్థాపకురాలికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న హర్షవల్లి

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12: కళా, సాహిత్య రంగాల్లో సేవలందిస్తున్న శ్రీ సాయి సరిగమప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు అధ్యక్షురాలు, నగరానికి చెందిన హర్షవల్లికి డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆవెఎకు నిర్వాహకులు పట్టా ప్రదానం చేశారు.

కుల వ్యవస్థ రూపుమాపేందుకు మీడియా కృషి చేయాలి

» ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ, ప్రొఫెసర్ కె. ఎస్.చలం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 12: ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారతదేశంలోనే అమలవుతుందని, దీనిని రూపుమాపటానికి మీడియా కృషి చేయాల్సి ఉందని ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ కె. ఎస్.చలం అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ప్రారంభించిన మూక్‌నాయక్ పత్రికకు 104 ఏళ్లు అయిన సందర్భంగా అంతర్జాతీయ దళిత మీడియా దినోత్సవాన్ని ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్‌వర్క్ (ఐడీజేఎన్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అతిథులు అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం నెలకొన్న సామాజిక అసమానతల తొలగింపులో మీడియా పాత్ర ప్రశ్నార్థకంగా మారిందన్నారు. స్వాతంత్ర్యానికి ముందుగా జాతీయ ఉద్యమం జరుగుతున్న సమయంలో దళిత బహుజనులకు తగిన ప్రాతినిధ్యం, హక్కుల రక్షణ కోసం అంబేడ్కర్ మూక్‌నాయక్ పత్రికను ప్రారంభించారని తెలిపారు. అంబేడ్కర్ అప్పట్లో సాధించిన విషయాలను ఆనాటి మీడియా తగిన ప్రాధాన్యత ఇచ్చేది కాదని, ఈ స్థితిలో ప్రత్యామ్నాయ మూక్‌నాయక్‌తోపాటు మరికొన్ని పత్రికలను స్థాపించి ప్రజాస్వామిక విలువలను కాపాడే ప్రయత్నం చేశారన్నారు. మీడియా స్వతంత్ర ంగా ఉండాలని అంబేడ్కర్ భావించారన్నారు.గీతం ప్రొఫెసర్ సి.ప్రజ్ఞ మాట్లాడుతూ దేశంలో మతపరమైన మరణహోమం జరుగుతోందన్నారు. రాజ్యాంగాన్ని సైతం మార్చేసే కుట్ర సాగుతున్నా, జాతీయ మీడియాలో చలనం లేదన్నారు. ఈ కార్యక్రమానికి ఐడీజేఎన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నానాజీ అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, దళిత, బహుజన ప్రతినిధులు బొడ్డు కల్యాణరావు, జేవీ ప్రభాకర్, వి.రాజేంద్రప్రసాద్, ఎం.కోటేశ్వరరావు, కె.వెంకటరమణ, రవి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కేఎస్ చలం

'చట్ట సభల్లో ముస్లింలకు ప్రాధాన్యం కల్పించాలి'



ఐక్యత చాటుతున్న ముస్లింలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12: చట్టసభల్లో ముస్లింలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ముస్లిం నాయకుడు హైదరాలి సింకా రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. రైల్వేన్యూకాలనీలోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ముస్లింలు ఎక్కువ శాతం నివశిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని, లేకుంటే స్వతంత్రంగా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ నజీర్ మాట్లాడుతూ పార్టీ అధినేత నారా చంద్రబాబు దృష్టికి సమస్య తీసుకుని వెళ్తానన్నారు. ముస్లింలు ఎక్కువ శాతం ఉన్న విశాఖలో ఒక అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని కోరుతామన్నారు. ముస్లిం నాయకులు అబ్దుల్ మునీర్, ఐహెచ్ ఫారుఖీ, అబ్దుల్ చిన రెహ్మాన్, మీర్ అబ్బాస్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'త్వరలో నిరుద్యోగ సమస్యలపై ఓదార్పు యాత్ర'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12: నిరుద్యోగుల సమస్యలు తెలుసుకొనేందుకు త్వరలో ఓదార్పుయాత్ర పేరిట రాష్ట్రంలో పర్యటించనున్నట్టు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ అన్నారు. నోటిఫికేషన్లు ఆలస్యం కావడంతో ఏపీ నిరుద్యోగుల వయోపరిమితి పెంచాలని కోరినా, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, కానీ, తెలంగాణ ప్రభుత్వం అక్కడ అమలు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం జనరల్ అభ్యర్థులకు 44 ఏళ్లనుంచి 46కు పెంచిందని, మరో ఐదేళ్లు కలిపి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 51 ఏళ్లకు పెంచిందన్నారు. ఏపీ ఉద్యోగ నోటిఫికేషన్లు చాలా తక్కువ విడుదల చేయడంతో నిరుద్యోగులు నష్టపోయారన్నారు, డీఎస్సీ, టెట్‌కి మధ్య కనీసం నెల రోజులు వ్యవధి చదువుకోవడానికి ఉండాలని కోరారు. టెట్ పరీక్షలు ఈ నెల 27 నుంచి మార్చి 9వ తేదీ వరకు జరుగుతాయని, టెట్ ఫలితాలు మార్చి 14వ తేదీన జరుగుతాయన్నారు. ఈ స్థితిలో 15న డీఎస్సీ పరీక్ష ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. సమయంలో లేకుండా అభ్యర్థులు సబ్జెక్టు ఎలా పూర్తి చేయగలుగుతారని నిలదీశారు.

జోన్-5 జేకేసీకి 4 ఫిర్యాదులు



ఫిర్యాదు స్వీకరిస్తున్న జడ్సీ కృష్ణ

జ్ఞానాపురం, ఫిబ్రవరి 12: జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనగన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు జడ్సీ ఆర్.జీవి కృష్ణ స్వీకరించారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 2, యూసీడీకి 1, ఇంజనీరింగ్‌కు ఒకటి చొప్పున మొత్తం నాలుగు వచ్చాయి. వీటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపించారు. కార్యక్రమంలో ఈఈ ప్రసన్నరెడ్డి, ఈఈ మృత్యరాజు, ఆర్ఓ బాబారావు, రాజ్యలక్ష్మి, వాటర్‌సప్లయ్ శేఖర్, ఏపీడీ పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

పేద ముస్లిం జంటకు వివాహం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12 : ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం కుటుంబాలకు ముస్లిం వెల్ఫేర్ సొసైటీ బాసటగా నిలుస్తుందని కమిటీ గౌరవాధ్యక్షుడు అబ్దుల్ మునీర్, అధ్యక్షుడు హైదరాలి సింకా అన్నారు. న్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో మునగపాకకు చెందిన ఓ నిరుపేద ముస్లిం వధువుకు సోమవారం సొసైటీ తరపున అత్యంత ఘనంగా వివాహాన్ని జరిపించారు. గాజువాక గౌసియా మసీదు ఇమామ్ అతహుర్ రెహమన్ ఖాజీగా వ్యవహరించి ఈ పెళ్లి చేశారు. ముస్లింలు మహ్మద్ నజీర్, ఐహెచ్ ఫారుఖీ పాల్గొన్నారు.

మురళీనగర్ వైశాఖీ పార్కు అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న సనపల.వరప్రసాద్

మురళీనగర్, ఫిబ్రవరి 12 ; మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కుకి మరింత వన్నె తెచ్చేలా అభివృద్ధి పథంలో నడిపిస్తామని అధ్యక్షుడు సనపల.వరప్రసాద్. సోమవారం పార్కులో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. 350 మంది పార్కు జీవిత కాల సభ్యులకు ఈ సందర్భంగా గత రెండేళ్లు ప్రెసిడెంట్‌గా పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులను సనపల వివరించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, బుద్ధిని విగ్రహం, సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనంతరం సభ్యులు విందులో పాల్గొన్నారు. జీవిత కాల సభ్యులకు బహుమతులందించారు. పి.నాగరాజు, కూర్మారావు, శాంతిభూషణ్, పృథ్వీరాజ్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాలు, గ్లాసులు పంపిణీ



కంచాలు, గ్లాసులు పంపిణీ చేస్తున్న అతిథులు, ఎన్టీఆర్ అభిమానులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 12: విల్లూరి చిన్నతల్లి చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గ్రేటర్ 31వ వార్డులోని జీవీఎంఆర్ ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నందమూరి అభిమానుల ద్వారా కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ విల్లూరి చక్రవర్తి, తిరుమలదేవి దంపతులు నిస్వార్థంగా చేస్తున్న సేవలను కొనియాడారు. నందమూరి అభిమానులుగా, చంద్రబాబు పిలుపుమేరకు సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అభిమానులు ఎస్ఎస్ఎన్ మూర్తి, దాసన సత్యనారాయణ, గుంపపీన అప్పలరాజు, కారి రాజేశ్వరరావు, వాసుపల్లి రామ్‌కుమార్,అప్పారావు, శ్రీను, పట్నాల శ్రీను,రమణ, మాధవి, సత్య, మీనాక్షి, దుర్గా, రజిని, భరత్, అంజలి, వెన్నెల పాల్గొన్నారు.

15న జాబ్‌మేళా

కంచరపాలెం, ఫిబ్రవరి 12 : కంచరపాలెం బాలికల ఐటీఐ ప్రాంగణంలోని నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 15వ తేదీ గురువారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు సబ్‌రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు.ఈ మేళాలో హీరో మోటో కార్పొరేషన్, డైకిన్ తదితర కంపెనీలు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పదో తరగతి, ఇంటర్. ఐటీఐ పాసైన వారు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు ముందుగా తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో నమోదుచేసుకోవాల్సి ఉంటుంది. ధ్రువపత్రాలతో గురువారం ఉదయం 10గంటలకు హాజరుకావాలని కోరారు.

రక్తదాన శిబిరం

జ్ఞానాపురం, ఫిబ్రవరి 12:జ్ఞానాపురం పోస్టాఫీసువీధిలో రోటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో వార్డు నాయకులు కోడిగుడ్ల శ్రీధర్ జన్మదినం సందర్భంగా అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ సందర్శించారు. వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులందజేశారు. అనంతరం శ్రీధర్ కేక్ కట్‌చేసిపేదలకు పండ్లు,మిఠాయిలు పంపిణీ చేశారు.

45వ వార్డులో పందుల బెడద

» వీధుల్లో విచ్చలవిడిగా సంచారం
» పొంచి ఉన్న వ్యాధుల భయం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12: గ్రేటర్ 45వ వార్డు పరిధిలో పందుల సంచారం అధికం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సత్యసాయినగర్, గణేష్‌కాలనీ, సింహగిరికాలనీ, సింగాలమ్మపురం, తాటిచెట్లపాలెం, కేంద్రీయ విద్యాలయం, ఏఎస్ఆర్‌నగర్, తదితర ప్రాంతాల్లోని గెడ్డలు, తుప్పల్లో పందులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. గెడ్డల్లో మునిగి బురదను చెల్లా చెదురు చేస్తుండడంతో పాటు రహదారులపైకి చేరుతున్నాయి. కొన్నిసార్లు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. రహదారులపైకి వస్తున్న సందర్భంలో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు అనేక అవస్థలు పడుతున్నారు. చెత్తకుప్పలు, మురుగు నీటి గుంటలవద్ద దోమలు విజృంభిస్తుండడంతో వ్యాధులు చుట్టుముడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి పందులు రోడ్లపైకి వచ్చేస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. వీటి నిరోధంలో జీవీఎంసీ సిబ్బంది విఫలమవుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పందుల బెడద తొలగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఏఎస్ఆర్‌నగర్ డ్రైనేజీలో వరాహం



గణేశ్ కాలనీలో చెత్త కుప్పల మధ్య పంది

ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో లైబ్రరీ ప్రారంభం



మాట్లాడుతూన్న మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఫిబ్రవరి 12: సీతమ్మధార పీ అండ్‌టీ కాలనీలోని ఎన్ ఎంసీహెచ్ పాఠశాలలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హ్యూమన్ వా ల్యూస్ వితరణ చేసిన రీడ్ లైబ్రరీని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాంప్రసాద్, అరుణ కుమారి పాల్గొన్నారు.

చిన్నయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి: సీపీఐ

అల్లిపురం,ఫిబ్రవరి 12: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పద్మనాభమండలం ఏనుగుపాలెంలో ఆత్మచేసుకున్న కొమ్మారు చిన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు కలెక్టర్ మల్లికార్జునరావుకు లేఖ రాశారు. కోవిడ్ సమయంలో చేసిన అప్పు చెల్లించలేక కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు చెప్పారు. ప్రాణాలతో బయట పడిన భార్య, ఇద్దరు పిల్లలను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు అవినీతిమయం: జనసేన



మాట్లాడుతున్న మూర్తి యాదవ్

సీతమ్మధార, ఫిబ్రవరి 12 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.120 కోట్ల భారీ వ్యయంతో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు అవినీతికి, అధికార దుర్వినియోగానికి చిరునామాగా మారాయని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. సోమవారం ఆయన పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు, కంపెనీలు, సంస్థల నుంచి సుమారు రూ.500 కోట్ల వరకూ ఆడుదాం ఆంధ్రా పేరిట దండుకొన్నారన్నారు. ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రభుత్వ క్రీడా మైదానాలను వదిలేసి ప్రైవేట్ స్థలాల్లో చలా చోట్ల పోటీలు నిర్వహించారని, క్రీడాకారులను పక్కకు నెట్టి వైసీపీ కార్యకర్తలను, వలంటీర్లను క్రీడాకారులుగా చూపించారని మూర్తి యాదవ్ ఆరోపించారు. పలు చోట్ల బాగా రాణించిన జట్లను పక్కన పెట్టేసి స్థానిక వైసీపీ నాయకులు చెప్పిన జట్లను విజేతలుగా ప్రకటించారన్నారు. మెజార్టీ ప్రాంతాల్లో క్రీడాకారులకు కనీస భోజన వసతి, సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇంట్లో కూర్చొని పబ్జీ ఆడుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ క్రీడలు విఫలమైనా నిధులు మాత్రం విచ్చల విడిగా ఖర్చు పెట్టారన్నారు. జనసేన ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్తలు నాగలక్ష్మి చౌదరి, కిరణ్ ప్రసాద్, రూప, బంటు రవి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంటు కేవీ క్లోజ్?

... 5వ పేజీ తరువాయి

నడుపుతున్నారు. పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్లు తొమ్మిది మందికి ఐదుగురే ఉన్నారు. హిందీ పండిట్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ టీచర్లు లేరు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు 18 ఉండగా...సగం మందే ఉన్నారు. ఇంగ్లీష్, సైన్స్, సోషల్ స్టడీస్-2, మేథమెటిక్స్-2, హిందీ, సంస్కృతం-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవి కాకుండా ఇతర అంశాలు బోధించడానికి ఆరుగురు (సంగీతం, క్రాఫ్ట్, నర్సింగ్, యోగా, స్పోర్ట్స్, డీఈఓ) ఉండాలి. వీరిలో ఒక్కరు కూడా లేరు.

1, 11 తరగతుల్లో అడ్మిషన్లు లేవు

ఇక్కడి కేంద్రీయ విద్యాలయాన్ని దశల వారీగా మూసేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లలో ఒకటి, 11 తరగతులు తీసేశారు. ఈ క్లాసుల్లో ఎవరికీ ప్రవేశాలు ఇవ్వడం లేదు. ఇప్పుడు ప్లస్ 2 చదువుతున్న వారు 2025లో బయటకు వెళ్లిపోతారు. ఈ ఏడాది ప్లస్ 1లో ఎవరికీ అడ్మిషన్లు ఇవ్వడంలేదు. కాబట్టి 2025-26లో ప్లస్ 1, ప్లస్ 2 ఉండవు. అలాగే ఇప్పుడు ఒక్కో సెక్షన్‌లో 50 మంది ఉండగా...రెండు సెక్షన్లు కలిపి 100 మందితో ఒకటే సెక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. తగినంత మంది బోధన సిబ్బంది లేకపోవడంతో ఈ విధంగా సర్దుబాటు చేస్తున్నారు.

విద్యార్థుల చదువుపై ప్రభావం

కేంద్ర ప్రభుత్వం తెర వెనుక ప్రయత్నాలతో టీచర్లను లేకుండా చేసి సెక్షన్‌లో విద్యార్థులను పెంచేసి నాణ్యమైన విద్య దక్కకుండా చేస్తోంది. దీంతో ఉన్నతోద్యోగుల పిల్లలకు సరైన విద్య అందడం లేదు. ఇక్కడైతే అన్నీ బాగుంటాయని బయట వారు చేర్పించారు. ఇప్పుడు వారి భవిష్యత్తు కూడా అగమ్యగోచరంగా మారుతోంది.

రాజకీయ క్రీడకు జన సమీకరణ

... 5వ పేజీ తరువాయి

ఫైనల్స్ ఐదు ఓవర్లు ఆడిస్తారు. అది పూర్తయిన తరువాత బహుమతి ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా ఆయన అందరినీ ఉద్దేశించి మాట్లాడతారు. దీని తరువాత లేజర్ షో, బాణాసంచా కాల్చడానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఇవన్నీ డ్రోన్ కెమెరాలతో షూట్ చేస్తారు. అంతర్జాతీయ క్రికెటర్లు ఆడిన గ్రౌండ్‌ను రాజకీయ వేదికగా మార్చేస్తున్నారు. ఇప్పటివరకూ ఏ రాజకీయ పార్టీ ఇలా చేయలేదు. క్రికెట్ అభిమానులు స్టేడియానికి వచ్చి మ్యాచ్‌లు చూశారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ఈసారి ఓటర్లను తీసుకువచ్చి...స్టేడియంలో కూర్చోబెడుతున్నారు. వారిలో చాలామందికి క్రికెట్‌పై అవగాహన కూడా ఉండదంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

1,200 మంది పోలీసులతో బందోబస్తు

ముగింపు వేడుకలకు సీఎంతో పాటు మూడు జిల్లాల అధికార పార్టీ నాయకులు వస్తుండడం, ఇది అధికారిక కార్యక్రమం కావడంతో 1,200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. అంటే ఒక అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరిగితే ఎలాంటి ఏర్పాట్లు ఉంటాయో అంతకు రెట్టింపు సంఖ్యలో బలగాలను మోహరిస్తున్నారు. ఇక్కడికి 20 కి.మీ. సమీపంలో 'సిద్ధం' పేరుతో ఉత్తరాంధ్ర ఎన్నికల శంఖారావం సభ నిర్వహించి రెండు వారాలు మాత్రమే అయింది. అంతలోనే మరో సభ పెడుతున్నారంటే...ఉత్తరాంధ్రలో వాతావరణం తమకు అనుకూలంగా లేదని వైసీపీ నాయకులు గుర్తించినట్టున్నారని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

ఆడుదాం ఆంధ్రాలో అదే రచ్చ

... 5వ పేజీ తరువాయి

నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇరు జట్లు ఆడేందుకు గ్రౌండ్‌లో దిగే సమయంలో అనకాపల్లి జట్టు సభ్యులు మైదానంలో కూర్చుని నిరసన తెలిపారు. తమకు న్యాయం చేసేంత వరకు గ్రౌండ్ వదిలి వెళ్లబోమని స్పష్టంచేశారు. 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. సుమారు గంటపాటు మైదానంలోనే కూర్చోవడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. సమస్యను పెద్దది చేయకుండా అనకాపల్లి జట్టును మ్యాచ్ ఆడించాలంటూ ఆదేశాలు రావడంతో శాప్ అధికారులు, ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న విజయనగరం జిల్లా డీఎస్‌డీవో అనకాపల్లి, విశాఖ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహిస్తున్నామంటూ ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని విశాఖ జట్టు ఆటగాళ్లు తీవ్రంగా వ్యతిరేకించారు. అర్హత లేదని ప్రకటించిన జట్టుతో ఎలా ఆడతామని ఆందోళన నిర్వహించారు. వారితో శాప్, క్రీడా శాఖకు చెందిన అధికారులు మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎట్టకేలకు విశాఖ, అనకాపల్లి జట్ల మధ్య నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో విశాఖ జిల్లా జట్టు విజయం సాధించింది. ఆట సమయంలో అనకాపల్లి జట్టు కెప్టెన్‌కు గాయం కావడంతో కొంతసేపు ఆటకు అంతరాయం ఏర్పడింది.

బొండపల్లి నుంచి తహసీల్దారును అనుసరించా

... 5వ పేజీ తరువాయి

వాట్సాప్ చాటింగ్‌లు, వాట్సాప్ కాల్స్‌కు సంబంధించిన డేటా (ఐపీడీఆర్)ను పోలీసులు సేకరించారు. ఆయా వివరాల ఆధారంగా గంగారావును ప్రశ్నించారు. గంగారావును హత్య చేయాలనుకోలేదని, దాడి చేసి భయభ్రాంతులకు గురిచేయాలనుకున్నానని గంగారావు చెప్పినట్టు తెలిసింది. తాను ఎవరికి కన్వెయన్స్ డీడ్ జారీచేయాలని తహసీల్దార్ రమణయ్యను సంప్రతించానో...వారితో ఈ విషయం చర్చించానని గంగారావు చెప్పినట్టు సమాచారం. తాను దాడి చేస్తానని చెప్పినప్పుడు అవతలివారు ఎవరూ 'అలాంటి పని వద్దని చెప్పలేదని' స్పష్టంచేసినట్టు తెలిసింది. అలాగే తనకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై కూడా గంగారావు మొదట్లో తటపటాయించినా, తర్వాత మొత్తం పూసగుచ్చినట్టు పోలీసులకు వెల్లడించినట్టు సమాచారం. తహసీల్దార్ రమణయ్య విజయనగరం జిల్లా బదిలీ అయిన తర్వాత ఇక తన పని జరగదని నిర్ధారించుకున్నానని, దీనిపై మాట్లాడేందుకు ఆయన్ను కలిస్తే...తనను కసరడం, బెదిరించడంతోపాటు కలవొద్దని కరాఖండిగా చెప్పేవారని గంగారావు పోలీసులకు వివరించినట్టు తెలిసింది. బొండపల్లిలో రమణయ్య బాధ్యతలు స్వీకరించినప్పుడు తాను కూడా వెళ్లానని అక్కడ తాను కలిసేందుకు యత్నించినా, ఆయన అంగీకరించలేదని, రాత్రి వరకూ అక్కడే ఉండి, రమణయ్య ఇంటికి బయలుదేరినప్పుడు కారును అనుసరించినట్టు గంగారావు పోలీసులకు తెలిపాడు.

ఇంటికి వచ్చిన తర్వాత కూడా రమణయ్య తనతో మాట్లాడకుండా వెళ్లిపోవడంతో, ఆయన కిందికి వచ్చేంత వరకూ వేచిచూశానని, రాత్రి పది గంటల సమయంలో ఇంటికి వచ్చిన ఇద్దరిని సాగనంపేందుకు ఆయన కిందకు రావడంతో మాట్లాడానని, అప్పుడు కూడా బెదిరింపు ధోరణిలో మాట్లాడడంతో వెంట తీసుకువెళ్లిన రాడ్డుతో తలపై కొట్టినట్టు గంగారావు చెప్పాడు. తర్వాత తాను ద్విచక్ర వాహనంపై తన ఇంటికి వెళ్లగా, అక్కడి నుంచి ఎయిర్‌పోర్టుకు వేరొకరు డ్రాప్ చేసినట్టు గంగారావు పోలీసులకు వెల్లడించినట్టు సమాచారం. ఇదిలావుండగా ఈ కేసులో గంగారావును మాత్రమే నిందితుడిగా చూపించి దర్యాప్తు ముగించేయాలంటూ అధికార పార్టీకి చెందిన ఉన్నతస్థాయి నేతల నుంచి పోలీసులపై ఒత్తిళ్లు వస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందువల్లే కస్టడీలో వెల్లడించిన అంశాలను పోలీసులు ఇంతవరకూ బయటపెట్టకుండా గోప్యత పాటిస్తున్నారని అంటున్నారు.

18న అప్పుఘర్ వద్ద లోకేశ్ బహిరంగ సభ

విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి



మాట్లాడుతున్న వెలగపూడి రామకృష్ణ బాబు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ నెల 18న తూర్పు నియోజకవర్గంలో పర్యటించనున్నారని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేశ్ పర్యటనలో భాగంగా 18వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు అప్పుఘర్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి నేతలు, నుంచి బూత్ నాయకులు, కేడర్ తరలిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రతి బూత్‌లో కుటుంబ సాధికారిక సారథులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న 'ఉక్కు' విప్స్ ప్రతినిధులు

స్టీల్‌ప్లాంట్ విప్స్‌కు జాతీయ అవార్డు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 12: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఫోరమ్ ఆఫ్ వుమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్) విభాగానికి జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. జాతీయ స్థాయిలో నవరత్న కేటగిరి కింద పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఉత్తమ సంస్థ అవార్డు (మూడో స్థానం), సంస్థలో మహిళల అభ్యున్నతికి సంస్థ చేసిన ప్రశంశనీయమైన పనికి గుర్తింపుగా అవార్డు లభించింది. సోమవారం బెంగళూరులో జరిగిన విప్స్ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (హెచ్‌ఆర్) జి.గాంధీ, జీఎం (శిక్షణ) ఎస్.భాను అవార్డు అందుకున్నారు.

అదేవిధంగా టెలికాం విభాగంలో సీనియర్ టెక్నీషియన్ జె.దుర్గ జాతీయ స్థాయిలో నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరిలో ఉత్తమ మహిళా ఉద్యోగి (మూడో స్థానం) అవార్డు అందుకున్నారు.

'స్పందన'లో 22 వినతులు స్వీకరణ

గాజువాక, ఫిబ్రవరి 12: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి ప్రజలు 22 వినతులను జెడ్సీ ప్రసాద్‌కు అందజేశారు. వీటిలో అధికంగా పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, వీధి లైట్లు వేయాలని, కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉన్నందున వాటి నివారణకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరించవలసిందిగా సంబంధిత విభాగాల అధికారులకు జెడ్సీ ఆదేశించారు.

పోలిపిల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, ఫిబ్రవరి 12: జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడి పోలిపిల్లి అమ్మవారికి నూతనంగా నిర్మిస్తున్న మందిరం వద్ద మాఘమాస సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు పూజలతో పాటు హోమాన్ని జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో లలిత, విష్ణుసహస్రనామ పారాయనాలను పఠించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చిత్త రామారావు, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'బాల వికాస్' వార్షికోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 12: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసలో బాల వికాస్ కేంద్రం ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బి.సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు మన సంస్కృతీ సంప్రదాయాలు, స్వాతంత్ర్య సమరయోధుల గురించి బోధించడానికి బాల వికాస్ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బాలవికాస్ గురువు అల్లం రమాదేవి, అల్లారపు త్రివేణి, జోగేశ్వర్, సాయిశ్రీకాంత్, చిత్త గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట జోనల్ కార్యాలయంలో 'స్పందన'కు 6 ఫిర్యాదులు

వేపగుంట ఫిబ్రవరి 12: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 6 ఫిర్యాదులు అందాయి. వీటిలో ముఖ్యంగా బుచ్చిరాజుపాలెంలో అక్రమంగాచేపడుతున్ననిర్మాణాన్ని అడ్డుకోవాలని, గోపాలపట్నం హైస్కూల్ పార్క్‌లో జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. వెంకటాపురంలో రోడ్డు అక్రమ నిర్మాణం తొలగించాలని, వేపగుంట ఏరియాలో పార్క్ నిర్మాణం చేపట్టాలని తదితరఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపించి చర్యలు తీసుకుంటామని జెడ్సీ కె.హైమావతి పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **ట్రూ లవర్ :** శ్రీకన్య, వెంకటేశ్వర, గోకుల్, , శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **లాల్ సలామ్ :** మెలోడి, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **యాత్ర-2 :** సంగం, కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), శ్రీన్య (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** శారద, లక్ష్మీకాంత్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** రమాదేవి, లీలామహల్, లక్ష్మీకాంత్ (గాజువాక)
- నా సామిరంగ : శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 18, టమాటా 20, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 45, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 24, క్యారెట్ 22, దొండకాయలు 36, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబాటి 26, ముల్లంగి 14, నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 36, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 42, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 60, చిలగడదుంపలు 30 , కంద 54, దే ముదు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	117
ఫారం ధర	--	137
విత్ స్కిన్	--	244
స్కిన్‌లెస్	--	254

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



హడలెత్తిస్తున్న శునకాలు

- 62, 63 వార్డుల్లో స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు
- మల్కాపురం, జనతా కాలనీల్లోనూ..
- బయటకు వచ్చేందుకే భీతిల్లిపోతున్న ప్రజలు
- అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

సింధియా, ఫిబ్రవరి 12: మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) 62, 63 వార్డుల పరిధిలోని కాకరలోవ, చింతలలోవ, క్రాంతినగర్ ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా వీధుల్లో శునకాలు సంచరిస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. రాత్రిపూట రోడ్లపై తిష్ఠ వేసి పాదచారులు, ద్విచక్ర వాహనదారుల వెంటపడి దాడి చేస్తున్నాయి. ఇటీవల ఓ ద్విచక్ర వాహనదారుడు కుటుంబ సభ్యులతో కలిసి వస్తుండగా కుక్కల గుంపు వెంబడించడంతో వారు కిందపడి గాయాలపాలయ్యారు. దీనికితోడు సదరు వాహనదారుడిని ఓ కుక్క కరవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు.

అలాగే మూడు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ పెయింటర్‌ను కుక్కలు గాయపరిచాయి. అదేవిధంగా ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు వీధి కుక్కల దాడిలో గాయపడిన సంఘటనలు ఉన్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులు, వృద్ధులను గాయపరుస్తుం డడంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. దీంతో చిన్నారులను ఒంటరిగా బయటకు పంపాలంటేనే భయమేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట కుక్కల బెడద మరింత అధికంగా ఉంటుందని భీతిల్లుతున్నారు. అందువల్ల జీవీఎంసీ అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.

మల్కాపురం పరిసర ప్రాంతాల్లో..


మల్కాపురం: మల్కాపురం, శ్రీహరిపురం, జనతా కాలనీ, తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. విచ్చలవిడిగా వీధుల్లో గుంపులుగా ఇవి సంచరిస్తుండడంతో బయటకు వచ్చేందుకే భయమేస్తుందని పలువురు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ప్రధాన రహదారులపై కూర్చుని ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులను వెంబడిస్తున్నాయి. వీటికి భయపడి వాహనాలను అతి వేగంగా నడిపి ప్రమాదాల బారినపడి ఇప్పటికే పలువురు గాయపడిన ఘటనలున్నాయి. కుక్కల సంచారంపై పలుమార్లు జీవీఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



62వ వార్డు త్రినాథపురంలో రోడ్డుపై గుంపుగా ఉన్న కుక్కలు



మల్కాపురంలోని ఓ వీధిలో..



63వ వార్డు పరిధి జైయాంధ్ర కాలనీ రోడ్డులో రాత్రిపూట గుంపుగా సంచరిస్తున్న శునకాలు

కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ

పెదగంట్యాడ, ఫిబ్రవరి 12: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఈ నెల 16న అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఇక్కడి పోతిన సన్యాసిరావు భవన్‌లో విశాఖ స్టీల్ వర్కర్స్ యూనియన్ సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె సంపూర్ణంగా జరిగేలా ఏఐటీయూసీ నాయకులు కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు, కె.రాజబాబు, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, ఎ.విష్ణుమూర్తి, వై.దేముళ్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు.



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

'టీడీపీ-జనసేన కూటమితోనే స్వర్ణాంధ్ర సాధ్యం'

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 12: టీడీపీ-జనసేన కూటమితోనే స్వర్ణాంధ్ర సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి గణేష్‌నగర్‌లో సోమవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ అరాచక పాలన నుంచి రాష్ట్రం విముక్తి కావాలన్నదే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల ప్రధాన లక్ష్యమన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీంతో ప్రజలంతా ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీకి బుద్ధి చేప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ రామరాజు, రాజన్‌రాజు, కె.శ్రీనివాసవర్మ, రాంబాబు, పెంటారావు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

త్వరలో తీరనున్న ప్రయాణ కష్టాలు

- రెండు నెలల కిందట చంద్రనగర్ వద్ద అండ్‌పాస్‌వే పూర్తి
- ప్రస్తుతం చురుగ్గా ఇరువైపులా రహదారి నిర్మాణం పనులు
- సింహాచలం స్టేషన్ దిగువనున్న గ్రామాల ప్రజలకు ఊరట

గోపాలపట్నం, ఫిబ్రవరి 12: సింహాచలం రైల్వే స్టేషన్‌కు వెనుక భాగంలో రెండు నెలల క్రితం నిర్మించిన చంద్రనగర్ అండర్‌పాస్‌వేలో రహదారి నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. చంద్రనగర్ నుంచి పాతగోపాలపట్నం గ్రామానికి కలిపే మార్గంలో అండర్‌పాస్‌వే నిర్మాణం నవంబరు చేపట్టారు. గోపాలపట్నం దిగువ ప్రాంతంలోని ఆదర్శనగర్, చంద్రనగర్‌ల వద్ద రైల్వే గేట్లు వల్ల సరైన రవాణా వ్యవస్థ లేక సింహాచలం స్టేషన్‌కు దిగువన ఉన్న కొత్తపాలెం, చంద్రనగర్, ఎల్లపువానిపాలెం, కోటనరవ, నరవ, చింతగట్ల, జెర్రిపోతులపాలెం ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజలు దశాబ్దాల కాలంగా ఇబ్బంది పడుతున్నారు. అయితే ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రెండు దశాబ్దాల నుంచి ప్రతిపాదనలు చేస్తున్నా, కార్యరూపం దాల్చలేదు. కాగా, ఇటీవల ఎట్టకేలకు రైల్వే శాఖ ఈ ప్రాంతంలో అండర్‌పాస్ నిర్మాణం చేపట్టింది. దీంతో దిగువ ప్రాంతాల ప్రజలకు శాశ్వతంగా పరిష్కారం లభించలేదు. ఈ స్థితిలో ఈ అండర్‌పాస్‌వే నుంచి రాకపోకలకు వీలుగా రెండువైపులా రహదారి ని ర్మాణం పనులు కొద్ది రోజుల నుంచి చురుగ్గా జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే మరొక రెండు నెలల్లో అండర్‌పాస్‌వే అందుబాటులోకి రానుంది. ప్రజల కష్టాలు తీరనున్నాయి.



అండర్‌పాస్‌వేలోకి వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



చైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థుల క్రీడా విన్యాసాలు

ఎన్.ఎ.డి.జంక్షన్ ఫిబ్రవరి 12: ఎన్.ఎ.డి. చైతన్య టెక్నో స్కూల్‌లో ఘనంగా క్రీడా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలను చైతన్య స్కూల్స్ రీజనల్ ఇన్‌చార్జి అహ్మద్ అలీ జ్యోతి ప్రజ్వలన చేసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్‌కు అలవాటుపడి ఊబకాయం వంటి సమస్యలు చిన్నారుల్లో ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈస్థితిలో చిన్నారులకు శారీరక శ్రమకు వీలుగా క్రీడల్లో పాల్గొనేలా చూడాలని కోరారు. తల్లిదండ్రులు ఈ విషయంలో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.మహేష్, బి.సోనియా, లక్ష్మీమాధవి తదితర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

16న సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నేత జగ్గునాయుడు

మల్కాపురం, ఫిబ్రవరి 12: దేశ వ్యాప్తంగా ఈనెల 16న తలపెట్టిన పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. అఖిల పక్షాల ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ గేటు వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గం అనేక త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను ప్రధాని మోదీ ప్రభుత్వం యాజమానులకు అనుగుణంగా నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తోందన్నారు. ప్రైవేటు సంస్థల యజమానుల కోసం కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి ఎం జగ్గునాయుడు, ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, టీఎన్‌టీయూసీ జిల్లా నేత నక్కా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ సమావేశం

పెందుర్తి, ఫిబ్రవరి 12: అనకాపల్లి జిల్లా పరిధిలోని నియోజకవర్గ, మండల కాంగ్రెస్ అధ్యక్షుల సమావేశం మంగళవారం సుజాతనగర్‌లోని ఇంద్రాణి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా నేత వేగి దివాకర్ సోమవారం తెలిపారు.ఈ సమావేశానికి ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు హాజరుకానున్నారని చెప్పారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

గోపాలపట్నం, ఫిబ్రవరి 12: స్థానిక ఎస్సీబీసీ కాలనీలోని లక్ష్మీగణపతి ఆలయం వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాలనీ ప్రజల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కాలనీలో తీర్థమహోత్సవం ఘనంగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కృష్ణరాయపురంలో..

పెందుర్తిరూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి కృష్ణరాయపురంలోని విద్యా గణపతి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనను కార్పొరేటరు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులుఅంగటి సూరిబాబు, ఉమా మహేశ్, కంచుబోయిన సంతోష్, బొడ్డు దేముడుబాబు, మీసాల చాణక్య, ఆయిత రాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, సీతారాం, పెంటయ్య, నాయుడు, దిలీప్ పాల్గొన్నారు.



ఎస్సీబీసీ కాలనీలోని లక్ష్మీగణపతి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

ఆక్రమణలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, ఫిబ్రవరి 12: జీవీఎంసీ 65వ వార్డు సర్వే నంబర్-86, 274లలో భూ ఆక్రమణలను అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని, దీంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని తెలుగుదేశం పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం గాజువాక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ ఆక్రమణలను అరికట్టాలనే ప్రధాన డిమాండ్‌తో ఇప్పటికే పలుమార్లు వినతులు సమర్పించడంతో పాటు ఆందోళనలు చేసినా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ నెల 20వ తేదీలోగా ఆక్రమణలను అరికట్టకపోతే తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీ ఎత్తున ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు రట్టి వాసు, నాయకులు తమరే శివప్రసాద్, సుజాత, ఉమ, పోతిన వెంకటేశ్వరరావు, అంగ కృష్ణ, కామేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గాజువాక, ఫిబ్రవరి 12: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పీఎం నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. 65వ వార్డు పరిధి వికాస్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా దేశంలో ఎక్కడైనా రూ.ఐదు లక్షల విలువైన వైద్యాన్ని ఉచితంగా పొందవచ్చన్నారు. మహిళల కోసం కేంద్రం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని, అర్హులంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రసాద్, ప్రతినిధులు తారక్ ప్రసాద్, నీలవేణి, శ్రీనివాసరావు, ఎల్.సోంబాబు, బొండా యల్లాజీరావు, పద్మ, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు ఆయుష్మాన్ కార్డు నమూనాను అందజేస్తున్న ఏడీసీ వర్మ, కరణంరెడ్డి నరసింగరావు

ఘనంగా శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 12: జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహననగర్‌లోని శ్రీకృష్ణ ఆలయ 19వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీకృష్ణునికి తులసీ దళాలతో అర్చనలు చేశారు. ఇష్టమైన పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. అలాగే ఇక్కడి షిర్డీ సాయి ఆలయంలో బాబాకు పంచామృతాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు.



తులసీదళాలతో శ్రీకృష్ణుడు

రావాలమ్మ అమ్మవారి..

పాత వడ్లపూడిలోని రావాలమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించగా కార్పొరేటర్ బొండా జగన్‌తో పాటు భక్తులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చపట్టారు.

ఎన్నికల్లో సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ విజయకేతనం



వర్క్ కమిటీ ఎన్నికల్లో గెలుపుతో ఎన్ఏడీ కార్మికుల సంబరాలు

ఎన్.ఎ.డీ జంక్షన్ ఫిబ్రవరి 12: నేవల్ ఆర్మ్ డిపో (ఎన్.ఎ.డి.) విభాగానికి చెందిన వర్క్ కమిటీ ఎన్నికల్లో సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ విజయకేతనం ఎగురవేసింది. భీమిలి నూతన యూనిట్‌లో నిర్వహించిన ఈ ఎన్నికల్లో మూడు స్థానాలకు పోటీ నిర్వహించారు. సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు స్టార్ ప్యానల్ పేరుతో బరిలోకి దిగిన నాయక్, గణేశ్, రవిలు అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెలలో జరిగిన కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో కూడా తమ సభ్యులు గెలుపొందారన్నారు. గెలిపించిన కార్మికులకు ఈసందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. దీంతో యూనియన్ నాయకులు ఆఫీస్ పరిసరాల్లో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నూకరాజు, రమేష్, కో-ఆపరేటివ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పైడిమాంబ అమ్మవారి పండగ

ఎన్.ఎ.డి. జంక్షన్, జనవరి 12: బుచ్చిరాజుపాలెం పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవం శ్రీ పైడిమాంబ అమ్మవారి పరస మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. పండగ పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మెయిన్ రోడ్డులోని బాజీ జంక్షన్ నుంచి ఎన్ఏడీ కూడలి వరకు లైటింగ్ ఏర్పాటు చేశారు. పరస సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు, చేపట్టనున్నారు. సాయంత్రం డ్యాన్స్ బేబీ డ్యాన్స్, అందుల ఆర్కెస్ట్రా, తప్పెట గుళ్లు, పులివేషాలు తదితర సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



బుచ్చిరాజుపాలెంలో పైడిమాంబ

హైవేలో దీపాలకు మరమ్మతులు

ఎన్.ఎ.డీ జంక్షన్ ఫిబ్రవరి 12: నేషనల్ హైవేలో విద్యుత్ దీపాలకు మరమ్మతులు జీవీఎంసీ అధికారులు చురుగ్గా చేపడుతున్నారు. ముఖ్యంగా కొద్ది రోజుల్లో నగరానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వస్తుండటంతో హైవేలో దీపాలు సమస్యలేకుండా చేపడుతున్నారు. దీనిలో భాగంగా తాటిచెట్లపాలెం నుంచి ఎన్.ఎ.డీ ఎయిర్‌పోర్టు వరకుహైవే ఇరువైపులా వెలగని బల్బులు స్థానంలో కొత్తవాటిని అమర్చుతున్నారు.



ఎన్.ఎ.డి. వద్ద క్రేన్‌తో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఉక్కు ఆస్పత్రి వైద్యురాలికి అవార్డు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 12: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ చేసిన పరిశోధనలకు గాను అవార్డు లభించింది. ఇటీవల జంషెడ్‌పూర్‌లో జరిగిన ఆలిండియా స్టీల్ డాక్టర్స్ కాన్ఫరెన్స్‌కు విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి నుంచి పలువురు వైద్యులు పాల్గొని తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. గైనకాలజీ చీఫ్ డాక్టర్ సుజాత సమర్పించిన పత్రానికి రజత పతకం లభించింది. ఈ సందర్భంగా ఉక్కు ఆస్పత్రి వైద్య బృందానికి అధికారులు, కార్మికనేతలు, వివిధ అసో సియేషన్ల ప్రతినిధులుఅభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న వైద్యురాలు సుజాత

వైభవంగా భక్త మార్కండేయ జయంతి



మృత్యుంజయ హోమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 12: వన్‌టౌన్ బురుజుపేటభావనరుషి ఈశ్వరాలయంలో శ్రీపద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం భక్త మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. అర్చకులు పార్వతీపరమేశ్వరులు, భావనరుషి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వేదపండితుల నేతృత్వంలో మహామృత్యుంజయహోమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలందించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మివేత్త ఎం.వి. రాజశేఖర్, పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు కొప్పల రాజ్‌కుమార్, పప్పు రాజారావు, నరసింగరావు, సతీష్, హేమలత పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీలకు మొండిచేయి'

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 12: పక్కదారి పట్టించిన ఎస్సీ, ఎస్టీ ఫైనార్టీ కార్పొరేషన్ల నిధులను ఆ కార్పొరేషన్లకు తిరిగి కేటాయించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు.సోమవారం డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వేరే వాటికి ఖర్చుపెట్టి ఎస్సీ, ఎస్టీ ఫైనార్టీలకు ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోందని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ ఫైనార్టీలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జగదాంబ-1 సీపీఎం కార్యదర్శి ఎం.సుబ్బారావు తదితరులుపాల్గొన్నారు.

సాయి సరిగమప సేవా సంస్థ వ్యవస్థాపకురాలికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న హర్షవల్లి

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12: కళా, సాహిత్య రంగాల్లో సేవలందిస్తున్న శ్రీ సాయి సరిగమప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు అధ్యక్షురాలు, నగరానికి చెందిన హర్షవల్లికి డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆవేకు నిర్వాహకులు పట్టా ప్రదానం చేశారు.

కుల వ్యవస్థ రూపుమాపేందుకు మీడియా కృషి చేయాలి

» ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ, ప్రొఫెసర్ కె. ఎస్.చలం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 12: ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవస్థ భారతదేశంలోనే అమలవుతుందని, దీనిని రూపుమాపటానికి మీడియా కృషి చేయాల్సి ఉందని ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ కె. ఎస్.చలం అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ప్రారంభించిన మూక్‌నాయక్ పత్రికకు 104 ఏళ్లు అయిన సందర్భంగా అంతర్జాతీయ దళిత మీడియా దినోత్సవాన్ని ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్‌వర్క్ (ఐడీజేఎన్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అతిథులు అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం నెలకొన్న సామాజిక అసమానతల తొలగింపులో మీడియా పాత్ర ప్రశ్నార్థకంగా మారిందన్నారు. స్వాతంత్ర్యానికి ముందుగా జాతీయ ఉద్యమం జరుగుతున్న సమయంలో దళిత బహుజనులకు తగిన ప్రాతినిధ్యం, హక్కుల రక్షణ కోసం అంబేడ్కర్ మూక్‌నాయక్ పత్రికను ప్రారంభించారని తెలిపారు. అంబేడ్కర్ అప్పట్లో సాధించిన విషయాలను ఆనాటి మీడియా తగిన ప్రాధాన్యత ఇచ్చేది కాదని, ఈ స్థితిలో ప్రత్యామ్నాయ మూక్‌నాయక్‌తోపాటు మరికొన్ని పత్రికలను స్థాపించి ప్రజాస్వామిక విలువలను కాపాడే ప్రయత్నం చేశారన్నారు. మీడియా స్వతంత్రంగా ఉండాలని అంబేడ్కర్ భావించారన్నారు.గీతం ప్రొఫెసర్ సి.ప్రజ్ఞ మాట్లాడుతూ దేశంలో మతపరమైన మరణహోమం జరుగుతోందన్నారు. రాజ్యాంగాన్ని సైతం మార్చేసే కుట్ర సాగుతున్నా, జాతీయ మీడియాలో చలనం లేదన్నారు. ఈ కార్యక్రమానికి ఐడీజేఎన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నానాజీ అధ్యక్షత వహించగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, దళిత, బహుజన ప్రతినిధులు బొడ్డు కల్యాణరావు, జేవీ ప్రభాకర్, వి.రాజేంద్రప్రసాద్, ఎం.కోటేశ్వరరావు, కె.వెంకటరమణ, రవి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కేఎస్ చలం

'చట్ట సభల్లో ముస్లింలకు ప్రాధాన్యం కల్పించాలి'



ఐక్యత చాటుతున్న ముస్లింలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12: చట్టసభల్లో ముస్లింలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ముస్లిం నాయకుడు హైదరాలి సింకా రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. రైల్వేన్యూకాలనీలోని ఓ హోటల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ముస్లింలు ఎక్కువ శాతం నివశిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని, లేకుంటే స్వతంత్రంగా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ నజీర్ మాట్లాడుతూ పార్టీ అధినేత నారా చంద్రబాబు దృష్టికి సమస్య తీసుకుని వెళ్తానన్నారు. ముస్లింలు ఎక్కువ శాతం ఉన్న విశాఖలో ఒక అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని కోరుతామన్నారు. ముస్లిం నాయకులు అబ్దుల్ మునీర్, ఐహెచ్ ఫారుఖీ, అబ్దుల్ చిన రెహ్మాన్, మీర్ అబ్బాస్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'త్వరలో నిరుద్యోగ సమస్యలపై ఓదార్పు యాత్ర'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12: నిరుద్యోగుల సమస్యలు తెలుసుకొనేందుకు త్వరలో ఓదార్పుయాత్ర పేరిట రాష్ట్రంలో పర్యటించనున్నట్టు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ అన్నారు. నోటిఫికేషన్లు ఆలస్యం కావడంతో ఏపీ నిరుద్యోగుల వయోపరిమితి పెంచాలని కోరినా, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, కానీ, తెలంగాణ ప్రభుత్వం అక్కడ అమలు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం జనరల్ అభ్యర్థులకు 44 ఏళ్లనుంచి 46కు పెంచిందని, మరో ఐదేళ్లు కలిపి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 51 ఏళ్లకు పెంచిందన్నారు. ఏపీ ఉద్యోగ నోటిఫికేషన్లు చాలా తక్కువ విడుదల చేయడంతో నిరుద్యోగులు నష్టపోయారన్నారు, డీఎస్సీ, టెట్‌కి మధ్య కనీసం నెల రోజులు వ్యవధి చదువుకోవడానికి ఉండాలని కోరారు. టెట్ పరీక్షలు ఈ నెల 27 నుంచి మార్చి 9వ తేదీ వరకు జరుగుతాయని, టెట్ ఫలితాలు మార్చి 14వ తేదీన జరుగుతాయన్నారు. ఈ స్థితిలో 15న డీఎస్సీ పరీక్ష ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. సమయంలో లేకుండా అభ్యర్థులు సబ్జెక్టు ఎలా పూర్తి చేయగలుగుతారని నిలదీశారు.

జోన్-5 జేకేసీకి 4 ఫిర్యాదులు



ఫిర్యాదు స్వీకరిస్తున్న జడ్సీ కృష్ణ

జ్ఞానాపురం, ఫిబ్రవరి 12: జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనగన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీలు జడ్సీ ఆర్.జీవి కృష్ణ స్వీకరించారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి 2, యూసీడీకి 1, ఇంజనీరింగ్‌కు ఒకటి చొప్పున మొత్తం నాలుగు వచ్చాయి. వీటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపించారు. కార్యక్రమంలో ఈఈ ప్రసన్నరెడ్డి, ఈఈ మృత్యరాజు, ఆర్ఓ బాబారావు, రాజ్యలక్ష్మి, వాటర్‌సప్లయ్ శేఖర్, ఏపీడీ పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

పేద ముస్లిం జంటకు వివాహం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12 : ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం కుటుంబాలకు ముస్లిం వెల్ఫేర్ సొసైటీ బాసటగా నిలుస్తుందని కమిటీ గౌరవాధ్యక్షుడు అబ్దుల్ మునీర్, అధ్యక్షుడు హైదరాలి సింకా అన్నారు. న్యూకాలనీలోని సింకా గ్రాండ్ హోటల్‌లో మునగపాకకు చెందిన ఓ నిరుపేద ముస్లిం వధువుకు సోమవారం సొసైటీ తరఫున అత్యంత ఘనంగా వివాహాన్ని జరిపించారు. గాజువాక గౌసియా మసీదు ఇమామ్ అతహర్ రెహ్మాన్ ఖాజీగా వ్యవహరించి ఈ పెళ్లి చేశారు. ముస్లింలు మహ్మద్ నజీర్, ఐహెచ్ ఫారుఖీ పాల్గొన్నారు.

మురళీనగర్ వైశాఖీ పార్కు అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న సనపల.వరప్రసాద్

మురళీనగర్, ఫిబ్రవరి 12 ; మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కుకి మరింత వన్నె తెచ్చేలా అభివృద్ధి పథంలో నడిపిస్తామని అధ్యక్షుడు సనపల.వరప్రసాద్. సోమవారం పార్కులో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. 350 మంది పార్కు జీవిత కాల సభ్యులకు ఈ సందర్భంగా గత రెండేళ్లు ప్రెసిడెంట్‌గా పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులను సనపల వివరించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, బుద్ధిని విగ్రహం, సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనంతరం సభ్యులు విందులో పాల్గొన్నారు. జీవిత కాల సభ్యులకు బహుమతులందించారు. పి.నాగరాజు, కూర్మారావు, శాంతిభూషణ్, పృథ్వీరాజ్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాలు, గ్లాసులు పంపిణీ



కంచాలు, గ్లాసులు పంపిణీ చేస్తున్న అతిథులు, ఎన్టీఆర్ అభిమానులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 12: విల్లూరి చిన్నతల్లి చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గ్రేటర్ 31వ వార్డులోని జీవీఎంఆర్ ఆర్బీఎంయూపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నందమూరి అభిమానుల ద్వారా కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ విల్లూరి చక్రవర్తి, తిరుమలదేవి దంపతులు నిస్వార్థంగా చేస్తున్న సేవలను కొనియాడారు. నందమూరి అభిమానులుగా, చంద్రబాబు పిలుపుమేరకు సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అభిమానులు ఎస్ఎస్ఎన్ మూర్తి, దాసన సత్యనారాయణ, గుంపపిన అప్పలరాజు, కారి రాజేశ్వరరావు, వాసుపల్లి రామ్‌కుమార్,అప్పారావు, శ్రీను, పట్నాల శ్రీను,రమణ, మాధవి, సత్య, మీనాక్షి, దుర్గా, రజిని, భరత్, అంజలి, వెన్నెల పాల్గొన్నారు.

15న జాబ్‌మేళా

కంచరపాలెం, ఫిబ్రవరి 12 : కంచరపాలెం బాలికల ఐటీఐ ప్రాంగణంలోని నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 15వ తేదీ గురువారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు సబ్‌రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు.ఈ మేళాలో హీరో మోటో కార్పొరేషన్, డైకిన్ తదితర కంపెనీలు పాల్గొని యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ పాసైన వారు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు ముందుగా తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో నమోదుచేసుకోవాల్సి ఉంటుంది. ధ్రువపత్రాలతో గురువారం ఉదయం 10గంటలకు హాజరుకావాలని కోరారు.

రక్తదాన శిబిరం

జ్ఞానాపురం, ఫిబ్రవరి 12:జ్ఞానాపురం పోస్టాఫీసువీధిలో రోటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో వార్డు నాయకులు కోడిగుడ్ల శ్రీధర్ జన్మదినం సందర్భంగా అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ సందర్శించారు. వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులందజేశారు. అనంతరం శ్రీధర్ కేక్ కట్‌చేసిపేదలకు పండ్లు,మిఠాయిలు పంపిణీ చేశారు.

45వ వార్డులో పందుల బెడద

» వీధుల్లో విచ్చలవిడిగా సంచారం
» పొంచి ఉన్న వ్యాధుల భయం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 12: గ్రేటర్ 45వ వార్డు పరిధిలో పందుల సంచారం అధికం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సత్యసాయినగర్, గణేష్‌కాలనీ, సింహగిరికాలనీ, సింగాలమ్మపురం, తాటిచెట్లపాలెం, కేంద్రీయ విద్యాలయం, ఏఎస్ఆర్‌నగర్, తదితర ప్రాంతాల్లోని గెడ్డలు, తుప్పల్లో పందులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. గెడ్డల్లో మునిగి బురదను చెల్లా చెదురు చేస్తుండడంతో పాటు రహదారులపైకి చేరుతున్నాయి. కొన్నిసార్లు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. రహదారులపైకి వస్తున్న సందర్భంలో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు అనేక అవస్థలు పడుతున్నారు. చెత్తకుప్పలు, మురుగు నీటి గుంటలవద్ద దోమలు విజృంభిస్తుండడంతో వ్యాధులు చుట్టుముడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి పందులు రోడ్లపైకి వచ్చేస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. వీటి నిరోధంలో జీవీఎంసీ సిబ్బంది విఫలమవుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పందుల బెడద తొలగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఏఎస్ఆర్‌నగర్ డ్రైనేజీలో వరాహం



గణేశ్ కాలనీలో చెత్త కుప్పల మధ్య పంది

స్టీల్‌ప్లాంటు కేవీ క్లోజ్?

... 5వ పేజీ తరువాయి

నడుపుతున్నారు. పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్లు తొమ్మిది మందికి ఐదుగురే ఉన్నారు. హిందీ పండిట్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ టీచర్లు లేరు. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు 18 ఉండగా...సగం మందే ఉన్నారు. ఇంగ్లీష్, సైన్స్, సోషల్ స్టడీస్-2, మేథమెటిక్స్-2, హిందీ, సంస్కృతం-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవి కాకుండా ఇతర అంశాలు బోధించడానికి ఆరుగురు (సంగీతం, క్రాఫ్ట్, నర్సింగ్, యోగా, స్పోర్ట్స్, డీఈఓ) ఉండాలి. వీరిలో ఒక్కరు కూడా లేరు.

1, 11 తరగతుల్లో అడ్మిషన్లు లేవు

ఇక్కడి కేంద్రీయ విద్యాలయాన్ని దశల వారీగా మూసేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లలో ఒకటి, 11 తరగతులు తీసేశారు. ఈ క్లాసుల్లో ఎవరికీ ప్రవేశాలు ఇవ్వడం లేదు. ఇప్పుడు ప్లస్ 2 చదువుతున్న వారు 2025లో బయటకు వెళ్లిపోతారు. ఈ ఏడాది ప్లస్ 1లో ఎవరికీ అడ్మిషన్లు ఇవ్వడంలేదు. కాబట్టి 2025-26లో ప్లస్ 1, ప్లస్ 2 ఉండవు. అలాగే ఇప్పుడు ఒక్కో సెక్షన్‌లో 50 మంది ఉండగా...రెండు సెక్షన్లు కలిపి 100 మందితో ఒకటే సెక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. తగినంత మంది బోధన సిబ్బంది లేకపోవడంతో ఈ విధంగా సర్దుబాటు చేస్తున్నారు.

విద్యార్థుల చదువుపై ప్రభావం

కేంద్ర ప్రభుత్వం తెర వెనుక ప్రయత్నాలతో టీచర్లను లేకుండా చేసి సెక్షన్‌లో విద్యార్థులను పెంచేసి నాణ్యమైన విద్య దక్కకుండా చేస్తోంది. దీంతో ఉన్నతోద్యోగుల పిల్లలకు సరైన విద్య అందడం లేదు. ఇక్కడైతే అన్నీ బాగుంటాయని బయటవారు చేర్పించారు. ఇప్పుడు వారి భవిష్యత్తు కూడా అగమ్యగోచరంగా మారుతోంది.

రాజకీయ క్రీడకు జన సమీకరణ

... 5వ పేజీ తరువాయి

ఫైనల్స్ ఐదు ఓవర్లు ఆడిస్తారు. అది పూర్తయిన తరువాత బహుమతి ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా ఆయన అందరినీ ఉద్దేశించి మాట్లాడతారు. దీని తరువాత లేజర్ షో, బాణాసంచా కాల్చడానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఇవన్నీ డ్రోన్ కెమెరాలతో షూట్ చేస్తారు. అంతర్జాతీయ క్రికెటర్లు ఆడిన గ్రౌండ్‌ను రాజకీయ వేదికగా మార్చేస్తున్నారు. ఇప్పటివరకూ ఏ రాజకీయ పార్టీ ఇలా చేయలేదు. క్రికెట్ అభిమానులు స్టేడియానికి వచ్చి మ్యాచ్‌లు చూశారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ఈసారి ఓటర్లను తీసుకువచ్చి...స్టేడియంలో కూర్చోబెడుతున్నారు. వారిలో చాలామందికి క్రికెట్‌పై అవగాహన కూడా ఉండదంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

1,200 మంది పోలీసులతో బందోబస్తు

ముగింపు వేడుకలకు సీఎంతో పాటు మూడు జిల్లాల అధికార పార్టీ నాయకులు వస్తుండడం, ఇది అధికారిక కార్యక్రమం కావడంతో 1,200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. అంటే ఒక అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరిగితే ఎలాంటి ఏర్పాట్లు ఉంటాయో అంతకు రెట్టింపు సంఖ్యలో బలగాలను మోహరిస్తున్నారు. ఇక్కడికి 20 కి.మీ. సమీపంలో 'సిద్ధం' పేరుతో ఉత్తరాంధ్ర ఎన్నికల శంఖారావం సభ నిర్వహించి రెండు వారాలు మాత్రమే అయింది. అంతలోనే మరో సభ పెడుతున్నారంటే...ఉత్తరాంధ్రలో వాతావరణం తమకు అనుకూలంగా లేదని వైసీపీ నాయకులు గుర్తించినట్టున్నారని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

ఆడుదాం ఆంధ్రాలో అదే రచ్చ

... 5వ పేజీ తరువాయి

నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇరు జట్లు ఆడేందుకు గ్రౌండ్‌లో దిగే సమయంలో అనకాపల్లి జట్టు సభ్యులు మైదానంలో కూర్చుని నిరసన తెలిపారు. తమకు న్యాయం చేసేంత వరకు గ్రౌండ్ వదిలి వెళ్లబోమని స్పష్టంచేశారు. 'ఉయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. సుమారు గంటపాటు మైదానంలోనే కూర్చోవడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. సమస్యను పెద్దది చేయకుండా అనకాపల్లి జట్టును మ్యాచ్ ఆడించాలంటూ ఆదేశాలు రావడంతో శాప్ అధికారులు, ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న విజయనగరం జిల్లా డీఎస్‌డీవో అనకాపల్లి, విశాఖ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహిస్తున్నామంటూ ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని విశాఖ జట్టు ఆటగాళ్లు తీవ్రంగా వ్యతిరేకించారు. అర్హత లేదని ప్రకటించిన జట్టుతో ఎలా ఆడతామని ఆందోళన నిర్వహించారు. వారితో శాప్, క్రీడా శాఖకు చెందిన అధికారులు మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎట్టకేలకు విశాఖ, అనకాపల్లి జట్ల మధ్య నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో విశాఖ జిల్లా జట్టు విజయం సాధించింది. ఆట సమయంలో అనకాపల్లి జట్టు కెప్టెన్‌కు గాయం కావడంతో కొంతసేపు ఆటకు అంతరాయం ఏర్పడింది.

బొండపల్లి నుంచి తహసీల్దారును అనుసరించా

... 5వ పేజీ తరువాయి

వాట్సాప్ చాటింగ్‌లు, వాట్సాప్ కాల్స్‌కు సంబంధించిన డేటా (ఐపీడీఆర్)ను పోలీసులు సేకరించారు. ఆయా వివరాల ఆధారంగా గంగారావును ప్రశ్నించారు. గంగారావును హత్య చేయాలనుకోలేదని, దాడి చేసి భయభ్రాంతులకు గురిచేయాలనుకున్నానని గంగారావు చెప్పినట్టు తెలిసింది. తాను ఎవరికి కన్వేయన్స్ డీడ్ జారీచేయాలని తహసీల్దార్ రమణయ్యను సంప్రతించానో...వారితో ఈ విషయం చర్చించానని గంగారావు చెప్పినట్టు సమాచారం. తాను దాడి చేస్తానని చెప్పినప్పుడు అవతలివారు ఎవరూ 'అలాంటి పని వద్దని చెప్పలేదని' స్పష్టంచేసినట్టు తెలిసింది. అలాగే తనకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై కూడా గంగారావు మొదట్లో తటపటాయించినా, తర్వాత మొత్తం పూసగుచ్చినట్టు పోలీసులకు వెల్లడించినట్టు సమాచారం. తహసీల్దార్ రమణయ్య విజయనగరం జిల్లా బదిలీ అయిన తర్వాత ఇక తన పని జరగదని నిర్ధారించుకున్నానని, దీనిపై మాట్లాడేందుకు ఆయన్ను కలిస్తే...తనను కసరడం, బెదిరించడంతోపాటు కలవొద్దని కరాఖండిగా చెప్పేవారని గంగారావు పోలీసులకు వివరించినట్టు తెలిసింది. బొండపల్లిలో రమణయ్య బాధ్యతలు స్వీకరించినప్పుడు తాను కూడా వెళ్లానని అక్కడ తాను కలిసేందుకు యత్నించినా, ఆయన అంగీకరించలేదని, రాత్రి వరకూ అక్కడే ఉండి, రమణయ్య ఇంటికి బయలుదేరినప్పుడు కారును అనుసరించినట్టు గంగారావు పోలీసులకు తెలిపాడు.

ఇంటికి వచ్చిన తర్వాత కూడా రమణయ్య తనతో మాట్లాడకుండా వెళ్లిపోవడంతో, ఆయన కిందికి వచ్చేంత వరకూ వేచిచూశానని, రాత్రి పది గంటల సమయంలో ఇంటికి వచ్చిన ఇద్దరిని సాగనంపేందుకు ఆయన కిందకు రావడంతో మాట్లాడానని, అప్పుడు కూడా బెదిరింపు ధోరణిలో మాట్లాడడంతో వెంట తీసుకువెళ్లిన రాడ్డుతో తలపై కొట్టినట్టు గంగారావు చెప్పాడు. తర్వాత తాను ద్విచక్ర వాహనంపై తన ఇంటికి వెళ్లగా, అక్కడి నుంచి ఎయిర్‌పోర్టుకు వేరొకరు డ్రాప్ చేసినట్టు గంగారావు పోలీసులకు వెల్లడించినట్టు సమాచారం. ఇదిలావుండగా ఈ కేసులో గంగారావును మాత్రమే నిందితుడిగా చూపించి దర్యాప్తు ముగించేయాలంటూ అధికార పార్టీకి చెందిన ఉన్నతస్థాయి నేతల నుంచి పోలీసులపై ఒత్తిళ్లు వస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అందువల్లే కస్టడీలో వెల్లడించిన అంశాలను పోలీసులు ఇంతవరకూ బయటపెట్టకుండా గోప్యత పాటిస్తున్నారని అంటున్నారు.

18న అప్పుఘర్ వద్ద లోకేశ్ బహిరంగ సభ

విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి



మాట్లాడుతున్న వెలగపూడి రామకృష్ణ బాబు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ నెల 18న తూర్పు నియోజకవర్గంలో పర్యటించనున్నారని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేశ్ పర్యటనలో భాగంగా 18వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు అప్పుఘర్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభకు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి నేతలు, నుంచి బూత్ నాయకులు, కేడర్ తరలిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రతి బూత్‌లో కుటుంబ సాధికారిక సారథులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో లైబ్రరీ ప్రారంభం



మాట్లాడుతూన్న మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, ఫిబ్రవరి 12: సీతమ్మధార పీ అండ్‌టీ కాలనీలోని ఎన్ ఎంసీహెచ్ పాఠశాలలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హ్యూమన్ వా ల్యూస్ వితరణ చేసిన రీడ్ లైబ్రరీని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాంప్రసాద్, అరుణ కుమారి పాల్గొన్నారు.

చిన్నయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి: సీపీఐ

అల్లిపురం,ఫిబ్రవరి 12: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పద్మనాభమండలం ఏనుగుపాలెంలో ఆత్మహత్య చేసుకున్న కొమ్మూరు చిన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు కలెక్టర్ మల్లికార్జునరావుకు లేఖ రాశారు. కోవిడ్ సమయంలో చేసిన అప్పు చెల్లించలేక కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు చెప్పారు. ప్రాణాలతో బయట పడిన భార్య, ఇద్దరు పిల్లలను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు అవినీతిమయం: జనసేన



మాట్లాడుతున్న మూర్తి యాదవ్

సీతమ్మధార, ఫిబ్రవరి 12 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.120 కోట్ల భారీ వ్యయంతో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు అవినీతికి, అధికార దుర్వినియోగానికి చిరునామాగా మారాయని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. సోమవారం ఆయన పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు, కంపెనీలు, సంస్థల నుంచి సుమారు రూ.500 కోట్ల వరకూ ఆడుదాం ఆంధ్రా పేరిట దండుకొన్నారన్నారు. ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రభుత్వ క్రీడా మైదానాలను వదిలేసి ప్రైవేట్ స్థలాల్లో చలా చోట్ల పోటీలు నిర్వహించారని, క్రీడాకారులను పక్కకు నెట్టి వైసీపీ కార్యకర్తలను, వలంటీర్లను క్రీడాకారులుగా చూపించారని మూర్తి యాదవ్ ఆరోపించారు. పలు చోట్ల బాగా రాణించిన జట్లను పక్కన పెట్టేసి స్థానిక వైసీపీ నాయకులు చెప్పిన జట్లను విజేతలుగా ప్రకటించారన్నారు. మెజార్టీ ప్రాంతాల్లో క్రీడాకారులకు కనీస భోజన వసతి, సదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇంట్లో కూర్చొని పబ్జీ ఆడుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ క్రీడలు విఫలమైనా నిధులు మాత్రం విచ్చల విడిగా ఖర్చు పెట్టారన్నారు. జనసేన ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్తలు నాగలక్ష్మి చౌదరి, కిరణ్ ప్రసాద్, రూప, బంటు రవి పాల్గొన్నారు.

స్పందనకు ఏడు వినతులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 12 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఏడు వినతులు అందాయని జడ్సీ శైలజ వల్లీ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 2, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 2 అర్జీలు వచ్చాయన్నారు. వీటిని ఆయా విభాగాధిపతులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించామని ఆమె చెప్పారు.

20 నుంచి విజయ దుర్గా ఆలయ వార్షికోత్సవం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 12 : హనుమంతవాకలోని విజయదుర్గా ఆలయ వార్షికోత్సవం ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ రాజు తెలిపారు. సోమవారం ఆయన శివాజీపాలెంలో జనసేన నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారికి 108 కలశాలతో క్షీరాభిషేకం, విగ్రహం ఊరేగింపు. సహస్రనామ పారాయణం, సహస్ర దీపారాధన, , దుర్గా హోమం, పూర్ణాహుతి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఆలయ కమిటీ కార్యదర్శి నాగ భూషణరావు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

20 సీలింగ్ ఫ్యాన్లు వితరణ



పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు

ఆనందపురం, ఫిబ్రవరి 12 : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలకు 20 సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందించారు. సోమవారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను కలిసి ఫ్యాన్లు ఇచ్చారు. అలాగే గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని బి. శైలజాకు రూ. 2 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రామకృష్ణ పట్నాయక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పూతకు మంచు దెబ్బ

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 12 : మామిడి, జీడి రైతులకు ఈఏడాది పూత దశలోనే కష్టాలు మొదలయ్యాయి. ఏటా డిసెంబరు నెలలోనే పూతతో మామిడి, జీడి చెట్లు నిండుగా కనిపించేవి. ఈసారి ఫిబ్రవరి నెల వచ్చినా సగానికి పైగా చెట్లకు మొగ్గ కూడా కనిపించలేదు. ఉన్న కొద్దిపాటి పూత కూడా పొగమంచు బారిన పడి రాలిపోతుండడంతో రైతులు దిగుబడిపై ఆశలు వదులుకుంటున్నారు. మండలంలో అనంతవరం, పెంట, కొవ్వాడ, గంధవరం, బాందేవపురం, అయినాడ, చిన్నాపురం, బి. తాళ్లవలస, సత్యనారాయణపురం, తదితర గ్రామాల్లో సుమారు నాలుగు వేల ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. ఉన్న కొద్దిపాటి పూతకు కూడా తెగుళ్ల సోకడంతో ఆందోళన చెందుతున్నారు. గతంలో పిందె దశలోనే తోటలు కొనేందుకు ఆసక్తి చూపే వ్యాపారులు ఈసారి పూత లేకపోవడంతో కాపు ఎంతవరకు నిలబడుతుందో తెలియక ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. పూత ఆలస్యం కావడంతో దిగుబడి, గత ఏడాది కాయలకు తెగుళ్ల సోకి రైతులకు పెట్టుబడులు కూడా రాలేదు.

స్టీల్‌ప్లాంట్ విప్స్‌కు జాతీయ అవార్డు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 12: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఫోరమ్ ఆఫ్ వుమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్) విభాగానికి జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. జాతీయ స్థాయిలో నవరత్న కేటగిరి కింద పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఉత్తమ సంస్థ అవార్డు (మూడో స్థానం), సంస్థలో మహిళల అభ్యున్నతికి సంస్థ చేసిన ప్రశంసనీయమైన పనికి గుర్తింపుగా అవార్డు లభించింది. సోమవారం బెంగళూరులో జరిగిన విప్స్ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం (హెచ్ఆర్) జి.గాంధీ, జీఎం (శిక్షణ) ఎన్.భాను అవార్డు అందుకున్నారు.

సినిమా గైడ్

- **ట్రూ లవర్ :** శ్రీకన్య, వెంకటేశ్వర, గోకుల్, , శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **లాల్ సలామ్ :** మెలోడి, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **యాత్ర-2 :** సంగం, కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), శ్రీన్య (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజ బ్యాండు :** శారద, లక్ష్మీకాంత్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** రమాదేవి, లీలామహల్, లక్ష్మీకాంత్ (గాజువాక)
- నా సామిరంగ : శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 18,టమాటా 20, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 45, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 42, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 24, క్యారెట్ 22, దొండకాయలు 36, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబటి 26, ముల్లంగి 14,నిమ్మకాయలు (కిలో) 95, గోరుచిక్కుడు 36, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24,బీన్స్ (పెన్సిల్) 42, ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 60,పొట్లకాయ (పెద్దది) 20, చేమ దుంపలు 60, చిలగడదుంపలు 30, కంద 54, దేముడు చిక్కుడు 28, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర 3,తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	117
ఫారం ధర	137
విత్ స్కిన్	244
స్కిన్‌లెస్	254

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..



రెడ్డిపల్లిలో రోడ్డు పక్కన చెత్త వేసి తగలబెడుతున్న దృశ్యం



పద్మనాభం ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

ప్రధాన రహదారులే డంపింగ్ యార్డులు

- కాలుష్య కారకాలుగా పంచాయతీలు
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పద్మనాభం,ఫిబ్రవరి 12:పంచాయతీల్లోని ప్రధాన రహదారులు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. రోడ్ల పక్కన వేస్తున్న చెత్తను పారిశుధ్య సిబ్బంది తగలబెడుతూ గ్రామాలను కాలుష్య కారకాలుగా మారుస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది తడి, పొడి చెత్తగా ప్రతి ఇంటి నుంచి సేకరించి వాటినికి ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి తరలించాలి.అక్కడ వేరు చేసి తడి చెత్తతో వానపాముల ఎరువు, పొడి చెత్తను రీసైక్లింగ్ చేస్తారు. ఈ మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ కోసం లక్షలాది రూపాయల ఉపాధి నిధులతో షెడ్లు నిర్మించారు. ప్రస్తుతం ఇవి అలంకారప్రాయంగా ఉన్నాయి. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ సేకరిస్తున్న వ్యర్థాలను రోడ్డుపక్కన వేస్తున్నారు. అవి ఎక్కువయిన తరువాత జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా తగలబెట్టి పర్యావరణ కాలుష్యాన్ని పెంచుతున్నారు.ముఖ్యంగా ప్లాస్టిక్‌ను ఎట్టి పరిస్థితుల్లో కాల్చకూడదని నిబంధనలు ఉన్నా, ఆయా పంచాయతీలు తుంగలో తొక్కుతున్నాయి. పద్మనాభం, రేవిడి, పాండ్రంగి, రెడ్డిపల్లి, బీఆర్ తాళ్లవలస, అయినాడ, పొట్నూరు పంచాయతీల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ముఖ్యంగా చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్ల పక్కన, కాలువలు, చెరువుల పక్కన నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. అవి కుళ్లిపోయి ఆయా ప్రాంతాల్లో విపరీతమైన దుర్గంధం వెలువడుతోంది. వ్యర్థాల వల్ల కుక్కల బెడద కూడా పెరిగిపోయింది. సమస్యను నియంత్రించాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. సచివాలయాల్లో అన్ని విభాగాల ఉద్యోగులు ఉన్నా నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పారిశుధ్యం నిర్వహణలో పంచాయతీ పాలక వర్గాలు నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

సింహాచలం, ఫిబ్రవరి 12 : పార్టీలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన 98వ వార్డులో కార్పొరేటర్ పివి నరసింహంతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సింహాచలం బీఆర్‌టీఎస్ కారిడార్ నిర్వాసితులకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నష్టపరిహారం, టీడీఆర్‌లతోపాటు ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రియా గార్డెన్స్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తోమురోతు రాము జోన్-8 కమిషనర్ హైమావతి, వార్డు వైసీపీ ఇన్‌చార్జి ఎర్రవరం బాబు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపాలెంలో వైద్య శిబిరం రేపు

మధురవాడ, ఫిబ్రవరి 12 : జీవీఎంసీ ఏడో వార్డు చంద్రంపాలెంలో ఎన్టీఆర్ సేవా సమితి ట్రస్టు, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రంపాలెం వేపచెట్టు వద్ద ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. రోగులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

ఆనందపురం, ఫిబ్రవరి 12 : మండలంలోని బంటుపల్లివారి కళ్లాలులో ఎమ్మెల్యే ముత్తంశెట్టి 82 మంది లబ్ధిదారులకు సోమవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మిగిలిన అర్హులు కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ హేమంత్ కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పలనాయుడు, హౌసింగ్ ఏఈ శ్యామ్, జెడ్‌పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సర్పంచ్ కోన పైడిరాజు, నాయకులు శ్రీనివాసరావు, బంక సత్యం, వెంకటరావు పాల్గొన్నారు.

అంధ బాలికల పాఠశాలలో పాత్‌వే ప్రారంభం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 12 : ఆత్మవిశ్వాసంతో అంధ విద్యార్థినులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సీజీ ఎస్‌టీ కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్‌పంత్ అన్నారు. సోమవారం ఆయన సాగర్‌నగర్ సమీపంలోని అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పాత్‌వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజీఎస్‌టీ శాఖ పాత్ వే నిర్మాణానికి రూ. 3 లక్షల అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తిరుమల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీకి ఏయూ విద్యార్థుల ఎంపిక

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12 : ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎండీసీ) సంస్థలో ఉద్యోగాలకు ఏయూ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఏయూలో ఎంహెచ్‌ఆర్ఎం కోర్సు చదువుతున్న ఎం. ఉషారవి శ్రీ కిరణ్, ఎంఏ నూకరాజు, ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ కోర్సు చదువుతున్న కుంచె అపూర్వ ఈఘనత సాధించారు. వారికి వార్షిక వేతనంగా రూ.8.4లక్షలు అందిస్తారు. విద్యార్థులను వీసీ ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వీఆర్ రెడ్డి, ఆచార్య జాలాది రవి, ఆచార్య అరుణ్‌కుమార్, ఆర్ట్స్-కామర్స్ ప్లేస్‌మెంట్ అధికారి పి. మోహన్ గణేష్ పాల్గొన్నారు.

సైకాలజీ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులకు అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12 : ఏయూ సైకాలజీ విభాగం విద్యార్థులను వీసీ ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల జరిగిన 28వ అంతర్జాతీయ, 59వ జాతీయ ఇండియన్ అకాడమీ ఆఫ్ అప్లయిడ్ సైకాలజీ సదస్సులో విద్యార్థులు పాల్గొని, పలు అవార్డులు సాధించారు. ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె. పద్మరాజు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎంవీఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో ప్రవాసాంధ్ర సాహిత్యంపై సదస్సు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12 : ఏయూ ట్రాన్స్ డిసిప్లెనరీ రీసెర్చ్ హబ్, ఆస్ట్రేలియా తెలుగు తల్లి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో ప్రవాసాంధ్ర సాహిత్యం అన్న అంశంపై టీఎల్ఎన్.సభా హాల్లో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. వచ్చే నెల 1, 2 తేదీల్లో జరిగే ఈ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పీఎంపాలెంలో పార్కు ప్రారంభం

కొమ్మాది, ఫిబ్రవరి 12 : పీఎంపాలెం షిప్ యార్డు కాలనీలో రూ. 2 కోట్లతో నిర్మించిన పార్కును ఎమ్మెల్యే ముత్తంశెట్టి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక, బొట్టా అప్పలరాజు,పోతిన ప్రసాదు, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

తగరపువలస, ఫిబ్రవరి 11 : తగరపువలసలో సాయిసంహిత సేవా సంస్థ ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వృద్ధులకు దుప్పట్లు, వాటర్ బాటిళ్లు అందించారు. అలాగే విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు ఆర్. అప్పలరాజు, సభ్యులు ఆర్. సన్యాసిరావు, ఆదిలక్ష్మి, సంతోషికుమారి, సాయి ప్రణీత, జ్ఞాన సంహిత పాల్గొన్నారు.

నవోదయ ప్రిన్సిపాల్‌గా చంద్రశేఖర్

కొమ్మాది, ఫిబ్రవరి 12 : కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఇటీవల జరిగిన ర్యాగింగ్ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయం అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు ఇక్కడి ప్రిన్సిపాల్ సంజయ్‌ను రీజనల్ కార్యాలయానికి (హైదరాబాద్) బదిలీ చేశారు. ఆయన స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌కు అదనపు ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12 : జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో వేంచేసి ఉన్న నూకాలమ్మ ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి అర్చకుడు వెంకటశర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, టీడీపీ వార్డు కార్యదర్శి మళ్ల రవికుమార్, గ్రామస్తులు నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ స్పందనకు 96 వినతులు



వినతులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఏడీసీ విశ్వనాథన్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12 : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్య క్రమానికి నగర వ్యాప్తంగా 96 వినతులు, డయల్ యువర్ మే యర్‌కు 13 ఫోన్ కాల్స్ వచ్చా యి. మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ వినతులను స్వీకరించారు. మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని వారు సంబంధిత అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 12 : మండలంలోని పాతపాలెం, పెద్దనాగమయ్యపాలెం గ్రామాల్లో వందమంది విద్యార్థులకు భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. దివీస్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైద్యురాలు కల్యాణి, ఎంఈఓ శివరాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యునాని దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 12 : ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యాన్ని సమతుల్యంగా పరిరక్షించుకోవడం ఎంతో అవసరమని భీమిలి యునాని ఆస్పత్రి వైద్యురాలు బి. ప్రతిభ సూచించారు. సోమవారం ఎగువపేట వార్డు సచివాలయంలో యునాని డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రముఖ యునాని వైద్యుడు హకీమ్ అజ్మల్ ఖాన్ జయంతిని ప్రపంచ యునాని దినోత్సవంగా ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు.ముఖ్యంగా భారత ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2016 నుంచి ఈ దినోత్సవాన్ని దేశంలో నిర్వహిస్తున్నామన్నారు. కొన్ని వేల సంవత్సరాలుగా వున్న యునాని వైద్యంపై ప్రజల్లో అవగాహన పెంచ డానికే ఉచిత యునాని వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, ప్రభుత్వ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్, వైసీపీ నాయకుడు అల్లిపిల్లి నరసింగరావు, మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు మైలపల్లి లక్ష్మణరావు, కదిరి ఎల్లాజి, అనపర్తి సూర్య ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఎన్ఓఏఏ చీఫ్ సైంటిస్ట్

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 12 : అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఏఏ) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ విజయ్ తల్లా ప్రగడ సోమవారం ఏయూను సందర్శించారు. ముందుగా ఏయూ వాతావరణ శాస్త్ర విభాగాన్ని సందర్శించి, ఆచార్యులతో సంభాషించారు. విభాగంలో జరుగుతున్న పరిశోధనలు, వసతులను పరిశీలించారు. అనంతరం వీసీ ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విజయ్ తల్లాప్రగడ మాట్లాడుతూ వర్సిటీ సాధించిన ప్రగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్‌తో 3.74 సీజీపీఏ సాధించడం ఏయూలో సాధిస్తున్న అత్యున్నత ప్రమాణాలను నిదర్శనంగా పేర్కొన్నారు. అనంతరం వర్సిటీ తరపున విజయ్ తల్ల ప్రగడను వీసీ ప్రసాదరెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

చిన్నయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి : సీపీఎం



చిన్నయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీపీఎం ఫ్లోర్ లీడర్ గంగారావు

పద్మనాభం, ఫిబ్రవరి 12 : అప్పుల బాధతాళలేక ఆత్మహత్య చేసుకున్న కొమ్మూరి చిన్నయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఏనుగులపాలెంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా సమయంలో రూ. 8 లక్షలు అప్పు చేసి కొనుగోలు చేసిన టాటా మేజిక్ వాహనం అప్పు తీరకపోవడంతో కుటుంబం మొత్తం ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. కుటుంబానికి ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్న అప్పులను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు భీమిలి డివిజన్ నాయకులు నర్సింగరావు ఉన్నారు.

పుస్తక రచనలపై ఆసక్తి చూపాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విజయబాబు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 12 : అధ్యాపకులు తాము బోధించే సబ్జెక్టులు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పుస్తక రచనలు చేయాలని డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. విజయబాబు అన్నారు. కళాశాల వాణిజ్య విభాగం అధ్యాపకుడు డి. మురళీధర్ రచించిన బీకామ్, ఎంకామ్ సబ్జెక్టుల పది స్వీయ రచనలను సోమవారం ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయ, డాక్టర్ రవిబాబు,ఉమామహేశ్వరరావు, డి. శ్రావణ్‌కుమార్, అరుణ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, విజయప్రతాప్, పాల్గొన్నారు.



రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

500 మందికి వైద్య పరీక్షలు

ఆరిలోవ, ఫిబ్రవరి 12 : ఆరిలోవ 11వ వార్డు గాంధీనగర్ సమీపంలోని రవీంద్రనగర్-2 రాజు కేటరింగ్ సమీపంలో సోమవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్‌టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకుడు, గీతం విద్యా సంస్థల ఛైర్మన్ ఎమ్.శ్రీభరత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గీతం వైద్యులు 500 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో 11వ టీడీపీ ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, కార్యదర్శి ఆబోతుల అప్పలరాజు, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి సన్యాసిరావు, గాడి సత్యం, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : టీడీపీ



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

తగరపువలస, ఫిబ్రవరి 12 : వేసవి దృష్ట్యా తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పిట్ల సురేష్ కోరారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు భీమిలిలోని జోనల్ కార్యాలయంలో జడ్సీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ చిట్టివలస గోస్తనీ నదిలో ఏర్పాటు చేసిన ట్యాంకులు శిథిలావస్థకు చేరడంతో నీరు నిల్వ ఉండక సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇక్క డున్న చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు చేయించాలని కోరారు. అలాగే నదిలోకి సముద్రం నీరు కలవడం వల్ల ఆయా ప్రాంతాల్లోని బావుల్లో ఉప్పు నీరు చేరుతోందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటరావు, పల్ల అప్పలకొండ, రామారావు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

భీమునిపట్నం : పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గంటా అప్పలకొండ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. సోమవారం వారు జడ్సీ శైలజ వల్లీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలమాంబ ఆలయం, నూకాలమ్మ ఆలయం, గంటస్తంభం, శివాలయం, నేరెళ్లవలస కాలనీ జంక్షన్‌ల్లో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే భీమిలి మినీ స్టేడియంలో క్రీడాకారులకు కనీస సదుపాయాలు కల్పించాలన్నారు.

ఉపాధ్యాయుల అప్రెంటీస్ జీవో కాపీలు దహనం



జీవో కాపీలను దహనం చేస్తున్న దృశ్యం

ఆనందపురం ఫిబ్రవరి 12 : డీఎస్సీ ద్వారా కొత్తగా నియామకాలు పొందే ఉపాధ్యాయులకు అప్రెంటీస్ విధానాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీలను యూటీఎఫ్ నాయకులు సోమవారం ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పోరాడి రద్దు చేయించుకున్న అంప్రెంటీస్ విధానాన్ని వైసీపీ ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించడం దుర్మార్గపు చర్య అన్నారు. ప్రస్తుత డీఎస్సీ నోటిఫికేషన్‌లో తక్కువ పోస్టులు భర్తీ చేస్తుండడంతో తీవ్ర ఆందోళనలో ఉన్న నిరుద్యోగ ఉపాధ్యాయులకు అంప్రెంటీస్ పునరుద్ధరణ మరింత ఆందోళన కలిగించే విషయమన్నారు. ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు జగన్‌మోహన్, గిడుతూరి రాజా, రమ్య, శుభలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరాక్రమధీరుడు ఆంజనేయస్వామి



బ్రహ్మశ్రీవులతో సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 12 : ముల్లోకాల్లో త్రివిక్రముడు, అపర పరాక్రమ ధీరుడు హనుమంతుడు అని సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు ఏబీసీ పార్కు ప్రాంగణంలో కొద్దిరోజులుగా షణ్ముఖశర్మ ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ఉదయం 8.30 నుంచి 1 గంట వరకూ శ్రీరామ షడక్షర పూర్వక హనుమద్వైభవ మహాయాగం, సాయంత్రం 5.30 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, 6.30 నుంచి షణ్ముఖ శర్మ ప్రసంగాలు నిర్వహించారు. జ్యోతిష్య నిపుణుడు కందాళ వెంకట సత్యశ్యామ్, అరుణా గాయత్రీ దంపతుల నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

బీఎస్ఎన్ఎల్ ఇంక్యుబిటేషన్ సెంటర్ ప్రారంభం

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 11 : విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజరు జి. ఆడమ్ తెలిపారు. సోమవారం ఆయన అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజరు ఎం. సత్యప్రసాద్, ఏజీఎం బీఎస్ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



గెలుపొందిన పతకాలతో క్రీడాకారులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 12 : నగరంలోని పోర్టు స్టేడియంలో ఇటీవల జరిగిన 7వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో భీమిలి రెమో లయన్స్ డ్రాగన్ మిక్సిడ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చూపారు. అకాడమీ విద్యార్థులు బంగారు పతకాలు 5, వెండి 7, రజిత పతకాలు 8 కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని మినీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విజేతలను, శిక్షణ ఇచ్చిన కరాటే చీఫ్ రెమో యాదవ్, అకాడమీ అధ్యక్షుడు వరహాలరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ లక్ష్మణరావు, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ పి. రమణ, వి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ మార్గ్ ఆశ్రమంలో సామూహిక ధ్యానం

ఆరిలోవ, ఫిబ్రవరి 12 : పాత డెయిరీ ఫారానికి సమీపంలో ఉన్న ఇందిరానగర్‌లోని ఆనంద్ మార్గ్ ఆశ్రమంలో సోమవారం నీలకంఠ దివాస్ పురస్కరించుకొని సామూహిక ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం ఆచార్యులు త్రిలోకానంద మాట్లాడుతూ ప్రతిఒక్కరిలోనూ ఆధ్యాత్మిక భావం ఉన్నప్పుడే సమాజంలో శాంతిభద్రతలు నెలకొంటాయని చెప్పారు. అనంతరం సౌమ్యానంద అవధూత ఆధ్వర్యంలో రోడ్డ పక్కన ఉన్న 200 మంది పేదలకు ఆహార పొట్లాలు అందించారు.